
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం 4 నవంబరు 2025



రామయ్యకు రజత

గజవాహనం

- రూ.40లక్షల విలువైన 31కిలోల వెండితో తయారీ
- అందజేసిన శంకర్‌నారాయణ, రాజ్యలక్ష్మి దంపతులు
- వివరాలు వెల్లడించిన దేవస్థానం ఈవో దామోదర్‌రావు

7

పార్టీ కార్యాలయం వద్ద

పోలీసు బందోబస్తు

- బారికేడ్లు పెట్టి దారి మూసివేత
- మణుగూరులో కొనసాగుతున్న 144 సెక్షన్

6

చేప పిల్లలు

చెరువుకు చేరాలి

- మత్స్యశాఖపై కలెక్టర్లతో మంత్రి వాకిటి శ్రీహరి వీడియో కాన్ఫరెన్స్

అయితే అతివృష్టి.. లేకుంటే అనావృష్టి అన్న చందాన మారింది వాతావరణ పరిస్థితి. ఒక్కో ఏడాది వర్షాలు లేక కరువు పరిస్థితులతో తల్లడిల్లుతున్న రైతులను ఈఏడాది అధికవర్షాలు నష్టాలు, కష్టాలు తెచ్చిపెట్టాయి. గతంలో వర్షాల కోసం రైతులు గ్రామ దేవతలకు కొలుపులు కట్టడం, కప్పల పెళ్లిళ్ల లాంటి కార్యక్రమాలు, పూజలు చేసిన సంఘటనలు అనేకం. కానీ ఈ ఏడాది వరుస వర్షాలతో వానాకాలం పంటలు వేసిన రైతులు తీవ్రంగా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంది. జిల్లాలో సుమారు 6లక్షల ఎకరాల్లో వానాకాలం సాగుచేసిన రైతులు అటు వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు చేతికొచ్చే తరుణంలో అక్టోబరులో సైతం వర్షాలు వదలలేదు. వానాకాలం చివరి వరకు వరుసగా వర్షాలు కురుస్తున్నాయి. యాసంగి సీజన్ కూడా జిల్లాలో మొదలైంది. మామూలుగా అయితే జూన్ నుంచి ఆగస్టు వరకే జిల్లాలో వర్షాలు కురిసే పరిస్థితి ఉండగా అక్టోబరులోనూ భారీవర్షాలు పడ్డాయి. అయితే ఈ సారి ఈ వర్షాలు మాకొద్దు బాబోయ్ అంటూ రైతులు మబ్బులు చూసి భయపడే పరిస్థితి నెలకొంది.

ఇటీవల భారీ వర్షాలకు ఖమ్మం రూరల్ మండలంలో నేలవాలిన వరి



అధిక వానలు..

తెచ్చెను నష్టాలు!

- జూన్ నుంచి అక్టోబరు వరకు సగటును మించి వర్షపాతం
- 90.32సెంటీమీటర్ల అంచనాకు గాను 123.08సెం.మీ నమోదు
- చేతికొచ్చే సమయంలో పడిన వానలతో పంటలు ధ్వంసం

ఖమ్మం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గతేడాది కూడా జిల్లాలో అధిక వర్షాలే పడగా.. గతేడాది జూన్‌నుంచి మే వరకు మొత్తంగా జిల్లాలో 104.22సెంమీ వర్షపాతం కురవాల్సి ఉండగా 149.20 సెం.మీ సగటు వాన పడింది. ఈ ఏడాది జూన్ నుంచి అక్టోబరు వరకు జిల్లాలో 90.32సెంమీ కురవాల్సి ఉండగా 123.08 సెంమీ వర్షపాతం నమోదైంది. ఇందులో జూన్‌నెలలో 13.12సెంమీకు గాను 12.39 సెంమీ, జూలో 24.09సెంమీ 28.16సెంమీ, ఆగస్టులో 24సెం.మీకుగాను 38.97సెంమీ, సెప్టెంబరులో 17.90సెం.మీకి గాను 24.11సెంమీ, అక్టోబరులో 11.03సెంటీమీటర్లకు 19.45సెంమీ వర్షపాతం నమోదయింది. జూన్‌నెల మినహా అన్ని నెలల్లోనూ అధిక వర్షపాతం నమోదైంది. అయితే గతేడాది జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో మాత్రమే అధిక వర్షాలు పడగా ఈఏడాది అక్టోబరులో కూడా అధికవర్షపాతం నమోదైంది. దీంతో జిల్లాలో పంటలు బాగానే దెబ్బతిన్నాయి. నాణ్యత లోపించింది. పత్తి, వరి, మొక్కజొన్న పంటల దిగుబడి, నాణ్యతపై తీవ్ర ప్రతాపం పడింది. నాణ్యత కోల్పోయిన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మధిర మండలంలో మిరప తోటలో చేరిన నీరు (ఫైల్)

యాసంగి సాగు ప్రణాళిక సిద్ధం..

జిల్లా వ్యవసాయశాఖ యాసంగి ప్రణాళిక సిద్ధం చేసింది. వరి 2,48,908 ఎకరాల్లో సాగుచేస్తారని అంచనా. జొన్న 324ఎకరాలు, మొక్కజొన్న 1,59,462 ఎకరాలు, చెరుకు 131 ఎకరాలు, పొగాకు10 ఎకరాలు, వేరుశనగ 463 ఎకరాలు, నువ్వులు 1,754 ఎకరాలు, శనగ 35 ఎకరాలు, మినుము 583 ఎకరాలు, పెసలు 6,458 ఎకరాలు, కంది 33 ఎకరాలు మొత్తంగా 4,17,202 ఎకరాలలో రబీ పంటలు జిల్లాలో వేస్తారని వ్యవసాయశాఖ అంచనావేసింది. పాలేరు జలాశయంలో నీరు సమృద్ధిగా ఉండడంతో యాసంగి సాగుతో ఆయకట్టు కళకళలాడే అవకాశం ఉంది. అయితే తుఫాన్ ప్రభావాలు యాసంగిలో కూడా వస్తే కొన్నిసందర్భాల్లో సాగుకుఅనుకూలంగా ఉండే పరిస్థితి ఉండగా పంట చేతికి వచ్చే సమయంలో భారీవర్షాలు పడితే వేసవిలో కూడానష్టపోయే అవకాశాలున్నాయి.


మూసివేసి ఉన్న కళాశాల

ప్రైవేట్ కాలేజీల బంద్

సంపూర్ణం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం నిరసన
- బీటెక్, డిగ్రీ, వృత్తి విద్యా కళాశాలలకు తాళాలు
- ఆందోళన బాటలో ఉమ్మడి జిల్లాలోని యాజమాన్యాలు
- బకాయిలు చెల్లించే వరకూ బంద్ పాటిస్తామని హెచ్చరిక

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీటెక్, డిగ్రీ, వృత్తి విద్యా కళాశాలలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కోరుతూ.. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సోమవారం సంపూర్ణ బంద్ పాటించాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, బీఈడీ, పాలిటెక్నిక్, పీజీ కళాశాలలు మూసి ఉంచారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ ప్రైవేట్ కళాశాలల మేనేజ్మెంట్ మళ్లీ ఉద్యమ బాట పట్టింది. దీంతో ప్రైవేట్ వృత్తి విద్యా కళాశాలలు మూత పడడంతో.. సోమవారం విద్యార్థులు తరగతులకు హాజరు కాలేదు.

ప్రైవేటు కళాశాలలు ఇంజనీరింగ్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, వృత్తి విద్య కళాశాలల విద్యార్థులకు ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మంజూరు చేయడం లేదు. దీంతో ఆయా కళాశాలల యాజమాన్యాలు మరోసారి నిరవధిక బంద్ నిర్వహించాయి. దసరాకు ముందు బీటెక్, డిగ్రీ, ప్రొఫెషనల్ కళాశాలల అధిపతులు రీయింబర్స్‌మెంట్ ఫీజుల కోసం పెద్ద ఎత్తున ఉద్యమించారు. అప్పుడు కళాశాల యాజమాన్యాలు కళాశాలలను మూసివేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. వారం రోజుల పాటు కళాశాలలన్నీ మూత పడడంతో బీటెక్, డిగ్రీ, వృత్తి విద్యా కళాశాలల విద్యార్థులు రోడ్లపైకి వచ్చి నిరసన కార్యక్రమాలు, ధర్నాలు, ర్యాలీలతో ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. దీంతో తప్పనిసరి పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో.. కళాశాలల్లో తరగతులు యధావిధిగా నిర్వహించారు. కళాశాలలకు ఇవ్వాల్సిన బకాయిలు రూ. 1200 కోట్ల రూపాయలలో రూ. 600 కోట్లను దసరా వరకు, మరో రూ. 600 కోట్లను దీపావళి లోగా చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ మొదటి విడతగా ఇస్తామన్న రూ. 600 కోట్లలో కేవలం రూ. 300 కోట్లను మాత్రమే విడుదల చేశారు. మొత్తమ్మీద రూ. 1200 కోట్ల బకాయిలలో ఇప్పటివరకు రూ. 300 కోట్లు మాత్రమే విడుదల చేయడంతో.. ఇంకా 900 కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లోనే ఉన్నాయి. కాగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రైవేట్ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 250కోట్ల బకాయిలు మంజూరు చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఈ బకాయిలు మంజూరు చేయకపోవడంతో సోమవారం నుంచి మరోసారి ప్రైవేటు కళాశాలలను మూసివేసి ప్రైవేట్ మేనేజ్మెంట్లు తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని బీటెక్, డిగ్రీ, వృత్తి విద్యా కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాకపోవడంతో కళాశాలల యాజమాన్యాల పరిస్థితి తలకు మించిన భారంగా మారింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు (మిగతా 8వ పేజీలో)

రాజకీయ అండ..

జీరో దందా!

- కల్లూరులో యథేచ్ఛగా ఇసుక అక్రమ వ్యాపారం
- ఓ నాయకుడే సూత్రధారి
- ఏపీ నుంచి అర్ధరాత్రి వేళల్లో దిగుమతి
- అధికారులకు సవాల్‌గా మారిన వైనం

కల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీకి సరిహద్దున ఉన్న కల్లూరులో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కులు జీరో బిల్లులతో నిత్యం అర్ధరాత్రి సమయాల్లో టిప్పర్ల ద్వారా ఇసుకను దిగుమతి చేస్తున్నారు. ఓ పార్టీకి చెందిన కీలక నాయకుడొకరు ఈ ఇసుక అక్రమ వ్యాపారంలో కీలక సూత్రధారిగా ఉన్నట్టు సమాచారం. గతంలో దందా చేసిన వ్యాపారులపై బెదిరింపులకు పాల్పడిన సదరు నాయకుడు.. ఇప్పుడంతా తానై రాజ్యమేలుతున్నాడన్న చర్చ జరుగుతోంది. ఇలా ఇసుక దందా వ్యాపారంలో కీలక పాత్ర వహిస్తున్న ఆ నాయకుడి వ్యవహారశైలి సొంత పార్టీ నాయకులకు ఇబ్బందికరంగా మారిందని, వారు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని తెలుస్తోంది. సదరు నాయకుడు.. రాజకీయంగా పై స్థాయిలో మరో నేత అండదండలతోనే అగడాలను కొనసాగిస్తున్నాడని, ఈ క్రమంలోనే కల్లూరు, పెనుబల్లి మండలాల్లో రోజూ రూ.లక్షల్లో ఇసుక వ్యాపారం చేస్తున్నట్టు తెలుస్తోంది.

ఏపీ నుంచి అక్రమంగా ఇసుక దిగుమతి ఇలా ...

ఏపీలోని విజయవాడ, నందిగామ, రాజమండ్రి ప్రాంతాల నుంచి ఇసుకను జీరో బిల్లులతో టిప్పర్ల ద్వారా అర్ధరాత్రి సమయాల్లో కల్లూరు పట్టణంలోకి తెస్తున్నారు. ఇలా 14టైర్ల టిప్పర్‌లో 50టన్నులు, 16టైర్ల టిప్పర్‌లో 60టన్నులు తెచ్చినందుకు గాను ర్యాంప్ నుంచి కల్లూరుకు చేరేవరకు మొత్తం రూ.26 వేలు అవుతోంది. అదే ఇసుక ఒరిజినల్ బిల్లులతో భద్రాచలం గోదావరి నుంచి కల్లూరుకు చేరే సరికి రూ.43వేలవుతుంది. ఈ లెక్కన జీరో బిల్లులతో దిగుమతి చేసుకున్న వ్యాపారులకు సగటున టన్నుకు రూ.433 గిట్టుబాటు


కల్లూరు ఇసుక అడ్డా నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

కాగా, వ్యాపార రూపంలో ఇసుక అవసరమైన వారికి రిటైల్‌గా టన్నుకు రూ.1400 అమ్ముకుంటున్నారు. ఇలా సగటున టన్నుకు రూ.1000 వరకు ఆదాయం వస్తుంది. కల్లూరు, పెనుబల్లి మండలాల్లో నిత్యం అర్ధరాతి సమయాల్లో సుమారు 10టిప్పర్ల ఇసుక దిగుమతి కాగా ఈ అక్రమ వ్యాపారం రూ.లక్షల్లో సగుతోందట. ఒరిజనల్ బిల్లులతో మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా దిగుమతయిన ఇసుక ఎక్కువ ధర పడటంతో ఇసుక అసవరమైన వారు అక్రమ వ్యాపారులను అశ్రయిస్తున్నారు. దీంతో కల్లూరు పట్టణంలో గల పలు బహిరంగ ప్రదేశాల్లోనే అడ్డాలుగా ఏర్పాటు చేసి ఇసుక అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఆ వ్యక్తులకు సదరు రాజకీయ నాయకుడితో పాటుగా పలువురు వ్యక్తులు అండగా ఉన్నట్టు చెబుతున్నారు. ఏపీకి కల్లూరు ప్రాంతం సరిహద్దున కావటంతో ఇసుక టిప్పర్లు సులువుగా వస్తున్నాయి.

అధికారులకు సవాల్‌గా మారిన వైనం....

ప్రస్తుతం కల్లూరులో సాగుతున్న ఇసుక దందా పోలీసు, రెవెన్యూ అధికారులకు సవాల్‌గా మారింది. అర్ధరాత్రి దిగుమతి అయిన ఇసుకను నియంత్రణకు వారు ఒక వైపు చర్యలు చేపడుతుండగా, మరో వైపు అక్రమార్కులు తమ పలుకుబడితో తప్పించుకుంటున్నారు. ఇందుకు ఇటీవల ఒక రోజు రాత్రి ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ప్రాంతం నుంచి ఆరు ట్రక్కుల ఇసుక కల్లూరు వస్తుండగా పట్టుకున్న అధికారులు వాటిని మళ్లీ వదిలేయడమే నిదర్శనమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


జీరో బిల్లులతో అక్రమంగా దిగుమతి అయిన ఇసుకను ట్రాక్టర్ల ట్రక్కుల్లో లోడింగ్ చేస్తున్న దృశ్యం

చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నాం : హరిత, ఎస్ఐ



జీరో బిల్లులతో కల్లూరులో సాగిస్తున్న ఇసుక అక్రమ వ్యాపారంపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నాం. మాకు అందిన సమాచారం ప్రకారం అక్రమంగా వచ్చిన ఇసుకను పట్టుకొని వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయటమే కాకుండా, ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తున్నాం. ఇసుక అక్రమ దిగుమతుల విషయంలో ఎప్పటికప్పుడు స్పందించి తగిన చర్యలు తీసుకోవడంతో పాటు రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాం.

సింగరేణి.. ముందడుగు

- ఖనిజాల పరిశోధనలో కీలక పరిణామం
- గతంలోనే ఎన్ఎఫ్‌టీడీసీతో ఒప్పందం
- ఇప్పటికే 'గూడెం'లో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు నిర్ణయం
- తాజాగా జవహర్‌లాల్‌నెహ్రూ అల్యూమినియం రిసెర్చ్ సెంటర్‌తో మరో ఒప్పందం



కొత్తగూడెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణలో భాగంగా చేపట్టిన కీలక ఖనిజాల (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్)కు సంబంధించిన పరిశోధనలో మరో అడుగు ముందుకు పడింది. బొగ్గు గనులకు సంబంధించి వేలంపాటలో బ్లాకులను సాధించుకోలేకపోతే సింగరేణికి గడ్డుకాలం ఏర్పడే పరస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి వేలం పాటల్లో పాల్గొనలేకపోవడం వల్ల సింగరేణి రెండు పెద్ద బొగ్గు గనులతోపాటు సుమారు రూ.60వేల కోట్ల రెవెన్యూ కోల్పోయింది. ఈ క్రమంలో సంస్థలో పనిచేసే 40వేల మంది కార్మికులు, మరో 30వేల మంది పొరుగు సేవల సిబ్బంది భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం కనిపిస్తోంది. దాంతో సంస్థ 'సింగరేణి గ్లోబల్' పేరుతో కీలక ఖనిజాల రంగంలోకి ప్రవేశించాలని నిర్ణయం తీసుకుని.. దానికి తగిన రీతిలో అడుగులు వేస్తూ ముందుకెళ్తోంది. అందులో భాగంగానే కర్ణాటకలోని దేవ్‌దుర్గ్‌లో బంగారం, రాగి అన్వేషణకు సంబంధించి ఆగస్టులో టెండర్లను దక్కించుకుంది. అప్పటినుంచి కీలక ఖనిజాల అన్వేషణకు సంబంధించి మిగిలిన అంశాలపైన కూడా సింగరేణి దృష్టిసారించింది.

కొద్దిరోజుల క్రితమే ఎన్ఎఫ్‌టీడీసీతో ఒప్పందం

కీలక ఖనిజాలను గుర్తించి, ఉత్పత్తి చేసేందుకుగాను కొత్తగూడెం కేంద్రంగా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన సింగరేణి అందుకు సంబంధించి కొద్ది రోజుల క్రితమే కేంద్ర ప్రభుత్వ అధికారిక పరిశోధన సంస్థ నాన్ ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డవలప్‌మెంట్ సెంటర్ (ఎన్ఎఫ్‌టీడీసీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. సింగరేణి ప్రాంతంలో లభ్యమవుతున్న రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉత్పత్తి చేసేందుకు నిర్ణయం తీసుకోగా.. ఆ సమయంలోనే సింగరేణిలో పరిశోధనలు ప్రారంభించి ఓవర్ బర్డెన్ మట్టిలో, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి వెలువడే ఫ్లైయాష్‌లోనూ (మిగతా 6వ పేజీలో)

మేన'బంధాన్ని' మరిచి..

- చెల్లిని కాపురానికి తీసుకెళ్లడం లేదని బావపై కత్తితో దాడి
- అడ్డుకోబోయిన మేనత్తకూ కత్తిపోట్లు.. అక్కడికక్కడే మృతి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బావ
- తన మేనమామతో కలిసి ఘాతుకం
- ఏదులాపురం ముత్తగూడెంలో ఘటన


నాగమణి (ఫైల్)

7

మద్యానికి డబ్బులివ్వలేదని..

- గొడ్డలితో దాడి చేసి తల్లిని హతమార్చిన కొడుకు
- తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో ఘటన


భూబా (ఫైల్)

7

వీడని మిస్టరీ..

- పోలీసులకు సవాల్‌గా మారిన రామారావు హత్య కేసు
- సీసీ పుటేజీలో నెంబర్ ప్లేట్ లేని కారు గుర్తింపు
- సోమవారం 5 గంటల పాటు సమీక్షించిన సీపీ సునీల్‌దత్

7


సీసీ పుటేజీల్లో అనుమానితుడిగా భావిస్తున్న వ్యక్తి

మైనింగ్, క్వారీ లీజుకు పర్యావరణ అనుమతికి

సర్వే నివేదికపై ప్రజాభిప్రాయ సేకరణ

- అభిప్రాయాలకు జిల్లా వెబ్‌సైట్
- గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకుడు రమేష్

7



సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

కాంగ్రెస్ నాయకుల దాడి అమానుషం

- డీఎంఎఫ్ నిధులు ఎక్కడికి తరలించారో తేల్చాలి
- అప్పటివరకు నా పోరాటం ఆగదు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రేగా

మణుగూరు టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమ తెలంగాణ భవన్ పై కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేయడం అమానుషమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎంఎఫ్ నిధులు జిల్లాకు కేటాయించకుండా బయటికి తరలిస్తుంటే వాటిపై తాను ఈ నెల 7వ తేదీన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి శ్రీకారం చుట్టానన్నారు. అది మింగుడు పడని కాంగ్రెస్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నాయకులు, కార్యకర్తలను బీఆర్ఎస్ కార్యాలయంపైకి ఉసిగొల్పి దారుణానికి పాల్పడ్డారని ఆరోపించారు. దాడి జరిగిన సందర్భంగా తాను కార్యాలయంలో ఉంటే తనను చంపేందుకు కూడా వెనుకాడబోయేవారు కాదన్నారు. తమకు జరిగిన అన్యాయంపై తాము.. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యేపై డీఎస్పీకి ఫిర్యాదు చేస్తే.. వారు తమపై ఫిర్యాదులు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అభివృద్ధి పాలనను విస్మరించి రాష్ట్రంలో పలుచోట్ల దాడులకు పాల్పడుతూ ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఖమ్మం జిల్లా సామినేని రామారావు, ఎర్ర నాగేశ్వరావు హత్యలకు కారణమెవరని ప్రశ్నించారు. కార్యాలయం వివాదంపై హోంగార్డును పంపినా కూడా తన వద్ద ఉన్న ఆధారాలు చూపేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఎమ్మెల్యే పాయం నాలుగు పార్టీలు మారి బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని ఆరోపించారు. ఆయన చేసిన అభివృద్ధి నియోజకవర్గానికి శూన్యమన్నారు. ఈ సమావేశంలో నాయకులు కుర్రి నాగేశ్వరరావు. పోశం నర్సింహారావు, పగడాల సతీష్‌రెడ్డి ముత్యం బాబు, సూదిరెడ్డి గోపి రెడ్డి, వట్టం రాంబాబు, నూకారపు రమేష్ , అడపా అప్పారావు, కుంటా లక్ష్మన్ పాల్గొన్నారు.

ఉడత ఊపులకు భయపడేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం, పక్కన పొదెం

- కాంగ్రెస్ భవనానికి చెందిన కరెంటు బిల్లులు కూడా ఉన్నాయి
- పార్టీ ఫిరాయింపుల్లో అడ్డంగా దొరికిన దొంగ రేగా
- విలేకరుల సమావేశంలో పినపాక ఎమ్మెల్యే పాయం, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య

మణుగూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు చేస్తున్న ఉడత ఊపులకు, తాటాకు చప్పుళ్లకు కాంగ్రెస్ నాయకులు గానీ కార్యకర్తలు కానీ భయపడే పరిస్థితులు లేవని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులో 100 కోట్ల బేరసారాలు ఆడి అడ్డంగా దొరికిన తెలంగాణ ద్రోహి రేగా అని, ఆయనకు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ కార్యాలయానికి సంబంధించిన చరిత్రను వివరించారు. స్థలం దానంగా ఇచ్చినప్పటి నుంచి భూమి పూజ, ప్రారంభోత్సవంతో పాటు ఇంటి పన్నుల వివరాలు అందరికీ తెలుసని, వాటి రశీదులు, కరెంటు బిల్లులు, అన్ని ధ్రువపత్రాలు ఉన్నాయని తెలిపారు. 2009లో రెడిమెడ్‌గా వచ్చిన నాయకుడు రేగాకు నియోజకవర్గ దిక్కులు కూడా తెలియవని, నాడు అతడిని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పార్టీ గెలిపిస్తే బేరసారాలు చేసి పార్టీ ఫిరాయించిన సంగతి అందరికీ తెలుసునన్నారు. ఆయన పార్టీ మారుతూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల శక్తితో కట్టుకున్న భవనాన్ని కబ్జా చేశాడని ఆరోపించారు. తాను గెలిచిన తర్వాత నాయకులు, కార్యకర్తలు మన ఆఫీసును మనం స్వాధీనం చేసుకుందామని అన్నా.. తాను సముదాయించానన్నారు. కానీ ఆదివారం నాయకులు, కార్యకర్తలు ఆఫీసుకు వెళ్లిన సమయంలో బీఆర్ఎస్ వారు తమ వారిపట్ల వ్యవహరించిన తీరు ఉద్రిక్తతకు కారణమైందన్నారు. రేగా కాంతారావు రెచ్చగొట్టగా.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయారని, దాన్ని తమ పార్టీ వారు ప్రతిఘటించారన్నారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు చేసిన చర్యను తాను అభినందిస్తున్నానని ఎమ్మెల్యే పాయం తెలిపారు. తన ముఖ్య అనుచరుడు నవీన్‌కు చందా హరికృష్ణ ఆ భవనాన్ని అమ్మాడని, ఇందుకు సంబంధించి పత్రాలు తమ వద్ద ఉన్నాయన్న పాయం వాటిని విలేకరులకు చూపారు. డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య మాట్లాడుతూ.. మణుగూరులో కాంగ్రెస్ పార్టీ భవనాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం సాహసోపేత నిర్ణయమన్నారు. పార్టీ మారిన రేగా తర్వాత తెలంగాణ భవన్‌గా మార్చాడని, ఆభవనం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆస్తి అని అన్నారు. పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులకుశిరస్సు వంచి నమస్కారాలు తెలియజేసుకుంటున్నానని పొదెం వీరయ్య తెలిపారు. రేగా మాటలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తెలంగాణ భవన్‌కు వెళ్లే దారి మూసివేసిన దృశ్యం

పార్టీ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు

- బారికేడ్లు పెట్టి దారి మూసివేత
- కొనసాగుతున్న 144 సెక్షన్

మణుగూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తెలంగాణ భవన్‌లో ఆదివారం చోటు చేసుకున్న సంఘటన నేపథ్యంలో పోలీసులు భవన్ పరిసర ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం ప్రధాన రహదారి గుండా కార్యాలయం వైపునకు వెళ్లే దారిని బారికేడ్లు పెట్టి మూసివేసి.. స్పెషల్ పార్టీ బలగాలు పహారా కాస్తున్నాయి. వివాదాస్పదంగా మారిన ఈ ప్రాంతంలో రాకపోకలను ఇరువైపులా నిషేధించారు. జరిగిన సంఘటనపై బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు 100మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై డీఎస్పీ రవీంద్రరెడ్డికి ఫిర్యాదు చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు 10మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై ఫిర్యాదు చేశారు. పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి విధించిన 144సెక్షన్‌ను సోమవారం కూడా కొనసాగించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో జనం గుంపులుగా ఉండవచ్చని, సమూహాలుగా సంచరించరాదని హెచ్చరికలు చేస్తూ మైక్ ప్రచారాన్ని పోలీసులు చేపట్టారు. మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

15న ఖమ్మంలో ప్రత్యేక లోక్ అదాలత్

ఖమ్మం లీగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ ఆదేశానుసారం ఈ నెల 15న ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక లోక్‌అదాలత్ ద్వారా ఈ రోజునుండి నవంబర్ 15 వరకు చెక్ బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాద బీమా కేసులు, రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, న్యాయాధికారులు కె.ఉమాదేవి, వెంపటి అపర్ణ, ఎం.అర్చనా కుమారి, దేవినేని రాం ప్రసాదరావు, న్యాయసేవాధికారసంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి ఎం.కల్పన, వి.శివ రంజని, టి.మురళీమోహన్, కాసరగడ్డ దీప, బెక్కం రజని, ఏపూరి బిందు ప్రియ, వినుకొండ మాధవి, బి.నాగలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజగోపాల్

చేప పిల్లలు చెరువుకు చేరాలి

- మత్స్యశాఖపై కలెక్టర్లతో మంత్రి వాకిటి శ్రీహరి వీడియో కాన్ఫరెన్స్

కొత్తగూడెం కలెక్టరేట్ / ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చేప పిల్లలు చెరువుకు చేరేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పశు సంవర్థక, మత్స్య శాఖల మంత్రి వాకాటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి మత్స్య శాఖపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియో సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కలెక్టర్‌క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొనగా.. ఖమ్మం కలెక్టరేట్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ పాల్గొన్నారు. చేపల పంపిణీ టెండర్ల ఫైనల్ చేయడం,పంపిణీ పర్యవేక్షణ ఇతర శాఖల అధికారుల నియామకం, యాక్షన్ ప్లాన్ తయారీ, తదితర అంశాలపై సమీక్షించిన మంత్రి శ్రీహరి.. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య శాఖల మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. చేపలు చెరువులలో విడుదల కార్యక్రమం ఇప్పటికే ఆలస్యమైందని, నవంబర్ 20నాటికి నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు నీటి వనరులలో చేప, రొయ్య పిల్లలను విడుదల చేయాలన్నారు. టీ-మత్స్య యాప్‌లో చేప పిల్లల వివరాలు, సరఫరాదారుల, రవాణా చేసే వాహనం పూర్తి వివరాలను మత్స్య శాఖ అధికారి పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. చేప పిల్లల పంపిణీ కార్యక్రమం పూర్తి స్థాయిలో పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మత్స్యకారులు అధికంగా చేపల ఉత్పత్తి చేసేలా చూడాలని, చేపల ఉత్పత్తి పెంచడంతో పాటు వాటి విక్రయానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ స్థలాలలో చేపల స్టాల్స్, ఫిష్ మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఖమ్మం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ వీసీ అనంతరం అధికారులతో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, మత్స్యకార సంఘాల అధ్యక్షులు, కార్యదర్శి, మండలంలో ఉన్న నీటిపారుదల ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో చర్చించుకుని చేప పిల్లల విడుదల షెడ్యూల్ తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నీటిపారుదల అధికారి వెంకట్రాం, మత్స్య శాఖ సిబ్బంది రవి కుమార్, ఫిషరీస్ అసిస్టెంట్లు రాజేష్, సరిత తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్

సెయిల్ తరహాలో గ్రాట్యుటీ రూ.25లక్షలకు పెంచాలి

బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డి

ఇల్లెందు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్)వ్యవస్థలో పారదర్శకత, రిటైర్డ్ కార్మికుల సమస్యల సత్వర పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారతీయ మజ్దూర్‌సంఘ్ (బీఎంఎస్) జాతీయ బొగ్గుపరిశ్రమల ఇన్‌చార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డికేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సీఎంపీఎఫ్ ట్రస్ట్ చైర్మన్ విక్రమ్ దేవదత్తుతో ఢిల్లీలో సమావేశమయ్యారు. సమావేశంలో బొగ్గుగనుల కార్మికులకు సంబంధించిన సమస్యలతో పాటు, అమలు కావాల్సిన నూతన సంస్కరణల పై చర్చించారు. సీఎంపీఎఫ్ కార్యాలయాల్లో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయని, కార్మికులు బకాయిలను పొందడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సీఎంపీఎఫ్ సేవలను పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా జరపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్) కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులకు, కార్మికులకు, అధికారులకు 2025 అక్టోబరు 1 నుంచి గ్రాట్యూటీ మొత్తాన్ని రూ.20లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసిందని బొగ్గు పరిశ్రమలో సైతం గ్రాట్యూటీని రూ.25లక్షలకు పెంచాలని లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. కోల్ ఇండియాలో అనుబంధ బొగ్గ ఉత్పాదక సంస్థలతో పాటుసింగరేణి కాలరీస్‌లో సైతం గ్రాట్యూటీని పెంచడానికి చర్యలు చేపట్టాలని కోరారు. డీహెచ్ఎఫ్ఎల్ సంస్థ సీఎంపీఎఫ్ ట్రస్ట్ ద్వారా తీసుకున్న రుణాలు రూ. 728కోట్ల దుర్వినియోగానికి వ్యతిరేకంగా సీబీఐ దర్యాప్తు త్వరితగతిన జరపాలన్నారు. కోల్‌మైన్స్ ఉద్యోగులకు అమలు చేస్తున్న వివిధ ప్రయోజనాలు,నిబంధనలపై అవగాహన కల్పించడానికి హైదరాబాద్‌లోని సీఎంపీఎఫ్ కార్యాలయాన్ని శిక్షణాకేంద్రంగా అభివృద్ధి చేయాలని లక్ష్మారెడ్డి కేంద్ర ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శిని కోరారు.

సింగరేణి.. ముందడుగు

(5వ పేజీ తరువాయి)

కీలక ఖనిజాలు ఉన్నట్టు గుర్తించామని ఎన్ఎఫ్‌టీడీసీ ప్రతినిధులు ప్రకటించారు కూడా. కాగా తాజాగా మరో అడుగు ముందుకేసిన సింగరేణి కీలక ఖనిజాల పరిశోధనకు నాగ్‌పూర్ కేంద్రంగా పనిచేస్తున్న కేంద్ర గనుల శాఖ అనుబంధ స్వతంత్ర పరిశోధన సంస్థ అయిన జవహర్‌లాల్ నెహ్రూ అల్యూమినియం రిసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ సెంటర్ (జేఎన్ఏఆర్‌డీడీసీ)తో సోమవారం ఒప్పందం కుదుర్చుకుంది. కీలక ఖనిజాల ఉనికి, విస్తరణ అంశాలను శాస్త్రీయ విశ్లేషణ కోసం ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ ఎన్.బలరామ్, డైరెక్టర్ (పీఅండ్‌పీ) కె.వెంకటేశ్వర్లు, పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ అనుపమ్ అగ్నిహోత్రి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కాగా జేఎన్ఏఆర్‌డీడీసీ ఇప్పటికే అల్యూమినియం, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌లో పరిశోధనలు చేస్తూ పలు జాతీయ సంస్థలకు సాంకేతిక సహాయం అందిస్తోంది.

ఖనిజాల ఉనికి కచ్చితత్వం కోసం సహకారం : ఎన్.బలరాం, సింగరేణి సీఎండీ

సింగరేణి అంతర్జాతీయంగా కీలక ఖనిజాల రంగంలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలలో పరిశోధనలకు, ఖనిజాల ఉనికిని కచ్చితంగా నిర్ధారించుకోడానికి జవహర్‌లాల్ నెహ్రూ రిసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్ సహకారాన్ని తీసుకుంటున్నాం. సింగరేణి ప్రాంతంలోని ఓపెన్‌కాస్ట్ గనుల్లో లభ్యమయ్యే ఓవర్ బర్డెన్‌లో, ఎస్టీపీపీలోని ఫ్లైయాష్‌లో సింగరేణి సమీప ప్రాంతాల్లోని గుట్టల్లో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉనికి ప్రాథమికంగా నిర్ధారించబడింది. దానిపై లోతుగా పరిశీలించడానికి సంస్థ సహకారం తీసుకుంటున్నాం. వాటితో పాటు భూ విజ్ఞాన శాస్త్రం, ఖనిజరంగాల్లో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటుంది. కీలక ఖనిజాల రంగంలోకి ప్రవేశించిన నేపథ్యంలో జాతీయస్థాయిలో కీలక ఖనిజాల పరిశోధన రంగంలో దశాబ్దాల అనుభవం కలిగిన ప్రభుత్వ పరిశోధనా సంస్థలతో సాంకేతిక సహాయం, పరస్పర సహాకరంతో, వ్యాపార భాగస్వామ్యంతో ముందుకెళ్లేందుకు నిర్ణయించాం.

చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

మణుగూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న రుణం చెల్లించేందుకు ఇచ్చిన చెక్ బౌన్స్ అయిన కేసులో ముద్దాయిపై నేరం రుజువైనందున ఆరు నెలల జైలు శిక్షతో పాటు ఎనిమిది లక్షల పరిహారం చెల్లించాలని శిక్ష విధిస్తూ మణుగూరు ప్రథమ శ్రేణి జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కంబపు సూరిరెడ్డి సోమవారం తీర్పునిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరు పట్టణంలోని అశోక్ నగర్ ప్రాంతానికి చెందిన గారపాటి సత్యనారాయణ, ఇదే ప్రాంతానికి చెందిన మంచాల అంజయ్య వద్ద 2017ఆగస్టు 26న రూ. ఎనిమిది లక్షలను అప్పుగా తీసుకున్నాడు. రుణం తిరిగి చెల్లించేందుకు 2019 ఆగస్టు 10న ఏడు లక్షల చెక్కును అంజయ్యకు ఇచ్చాడు. ఇచ్చిన చెక్కు బౌన్స్ అయింది. అంజయ్య ముద్దాయికి నోస్ ఇచ్చినా సమాధానం రాకపోవడం బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. సాక్ష్యాదారాలు పరిశీలించిన జడ్జి నేరం రుజువైనందన సత్యనారాయణకు ఈ మేరకు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఫిర్యాదు దారుని తరుపున న్యాయవాదులు నగేష్‌కుమార్, మదుసూధన్, రమేష్ వాదించారు.

ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

పోలీసులకు ఫిర్యాదు, కేసు నమోదు

బోనకల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి న మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు సోమవారం ఎస్ఐ పొదిలి వెంకన్న కేసు నమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మోటమర్రి గ్రామానికి చెందిన షేక్ రేష్మా(31)కు, ఖమ్మం వాసి షేక్ నజీర్‌తో 10ఏళ్ల క్రితం వివాహమైంది. ఖమ్మంలో వీరు ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నారు. గత నెల 27వ తేదీన ఇద్దరూ ద్విచక్ర వాహనంపై మోటమర్రి గ్రామానికి వచ్చారు. తిరిగి ఖమ్మంకు వెళ్లే క్రమంలో రాయనపేట వద్ద కుక్క అడ్డురావడంతో బైక్ పైనుంచి కిందపడ్డారు. దీంతో ఇద్దరికీ తీవ్రగాయాలు కాగా ఖమ్మం ప్రభుత్వా సుపత్రికి తరలించారు. వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 2వ తేదీన రేష్మా మృతి చెందింది. ఆమె తండ్రి షేక్ పెద్ద సైదులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విచారణ నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకన్న

సీపీఎం నాయకులకు మతిభ్రమించింది

హత్యా రాజకీయాలు చేసేది సీపీఎం
ప్రజల సంక్షేమం కోసం పనిచేసేది కాంగ్రెస్
డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

చింతకాని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకులకు మతిభ్రమించి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు సామినేని రామారావు హత్యను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించిందన్నారు. హత్యపై క్షణాల్లో స్పందించిన భట్టి దుండగులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారన్నారు. హత్యా రాజకీయాలకు కాంగ్రెస్ దూరమని, రాష్ట్ర ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ఎజెండా అన్నారు. హత్యా రాజకీయాలు చేస్తున్నది ఎవరని గోకినేపల్లి, తెల్దారుపల్లి గ్రామాల్లో జరిగిన ఘటనలే నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ పథకాలకు, అభివృద్ధికి ఆకర్షితులైన ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతుంటే జీర్ణించుకోలేక సీపీఎం కాంగ్రెస్ పార్టీపై హత్య రాజకీయాల ముద్ర వేయడం ఏంటని ప్రశ్నించారు. పోలీసులు కేసు చేధనలో సమర్థవంతంగా పనిచేస్తున్నారని త్వరలో హత్య మిస్టరీని ఛేదిస్తారన్నారు. హత్యకు పాల్పడిన వారిని అందుకు సహకరించిన వారిన కఠిన శిక్ష తప్పదన్నారు. ఇప్పటికైనా సీపీఎం అసత్య ఆరోపణలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్, మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య, కన్నెబోయిన గోపి, కొప్పుల గోవిందరావు, కూరపాటి కిషోర్, బందెల నాగార్జున, సట్టు వెంకటేశ్వర్లు, అబ్దుల్ మజీద్, ఖాసీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్

రైతులను ఆదుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ

జూలూరుపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జూలూరుపాడులోని పార్టీ కార్యలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతులు పత్తి, వరి పంటల సాగు చేసి వేలాది రూపాయాల పెట్టుబడులు పెట్టినప్పటికీ అధిక వర్షాలతో తీవ్రనష్టం సంభవించిందన్నారు. సీపీఎం జిల్లా నాయకుడు, గుగులోత్ ధర్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా మంగపేట క్రాస్ రోడ్డు వద్ద బుధవారం విగ్రహావిష్కరణ, సభ ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకుడు కొండపల్లి శ్రీధర్, పార్టీ మండల కార్యదర్శి యాస నరేష్, నాయకులు గార్లపాటి వెంకటి, బాణోత్ మధు, పద్దం సుగుణ, కోటేశ్వరరావు, రాధాకృష్ణ, వల్లమల చంద్రారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతూన్న సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు

సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మె

కొత్తగూడెం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సమ్మె తప్పదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఛైర్మన్ స్థాయిలో జరిగిన స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం శేషగిరిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల ఆరున సింగరేణి వ్యాప్తంగా అన్ని మైన్స్ డిపార్ట్‌మెంట్స్ వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, 8న జీఎం కార్యాలయం వద్ద ధర్నాలు చేపడతామన్నారు. అప్పటికీ యాజమాన్యం స్పందించకపోతే సమ్మెకు పిలుపునిస్తామని ప్రకటించారు.సమావేశంలో యూనియన్ నాయకులు మల్లిఖార్జున్‌రావు, క్రిష్టోఫర్, రాము, వీరస్వామి, లక్ష్మీనారాయణ, మల్లయ్య, రాజేశ్వరరావు, నర్సయ్యలు పాల్గొన్నారు.

ర్యాగింగ్ వ్యతిరేక ఉద్యమానికి సహకరించాలి

కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కార్యక్రమం
పాల్వంచ డీఎస్పీ సతీష్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ వ్యతిరేక ఉద్యమానికి సహకరించాలని పాల్వంచ డీఎస్పీ సతీష్ పిలుపునిచ్చారు. సోమవారం కొత్తగూడెం ప్రభుత్వ వైద్యకళాశాలలో ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ర్యాగింగ్ ప్రభావం, అనైతిక కార్యకలాపాలలో పాల్గొనడం వల్ల కలిగే పరిణామాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. ర్యాగింగ్ రహిత వాతావరణాన్ని సాధించేందుకు, నివారించడంలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. ప్రతి విద్యార్థి తోటివారి పట్ల స్నేహ పూర్వకంగా మెలుగుతూ తమ వైద్య విద్యను పూర్తి చేసుకోవాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో ప్రణాళికబద్ధంగా చదువుకొని వైద్య విద్యను పూర్తి చేయాలన్నారు. అనంతరం ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరిరావు, పాల్వంచ ఎస్‌హెచ్‌వో సుమన్, షీ టీం ఇంచార్జి రమాదేవి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

నగరంలో వివాహిత, కేశ్వాపురంలో యువకుడు

ఖమ్మంక్రైం/తిరుమలాయపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని ఓ వివిహిత మృతి చెందిన సంఘటనపై ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. త్రీటౌన్ పోలీసుల వివరాల ప్రకారం...చింతకాని మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన దుబ్బుల మధుసూదన్, కృష్ణవేణి(37) దంపతులు కొంతకాలంగా నగరంలో వ్యాపారం చేసుకుంటూ చైతన్యనగర్‌లో నివాసముంటున్నారు. ఓ చిన్న విషయమై ఇద్దరికి ఇంట్లో గొడవ జరగటంతో క్షణికావేశంలో వంటగదిలో కృష్ణవేణి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటి తర్వాత గుర్తించిన మధుసూదన్ తలుపులు తెరిచి ఆమెను ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కేశ్వాపురంలో ఓ యువకుడు...

తిరుమలాయపాలెం: మండలంలోని కేశ్వాపురం గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామంలోని దొడ్డారామయ్య-జయమ్మలకు ముగ్గురు సంతానం. వీరిలో కుమారుడు దొడ్డా వినయ్ (24) దివ్యాంగుడు. కొన్నిరోజులుగా తీవ్రమానసిక ఒత్తిడికి లోనాయ్యాడు. సోమవారం సాయంత్రం గ్రామంలోని కన్నెగంటి రామయ్య వ్యవసాయక్షేత్రంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వివరాలుసేకరించారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

ఖమ్మంక్రైం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రెండురోజులుగా నగరంలోని పలుప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించినట్టు ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ సోమవాం తెలిపారు. రెండు రోజులుగా 61మందిపై కేసు నమోదు చేశామని, అదే విధంగా అక్టోబరు నెలలో 466 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయని, 128 బుల్లెట్ బైక్‌లకు సైలెన్సర్లు మార్చడం జరిగిందన్నారు.

బతుకుదెరువు కోసం పోరాటం

గుంటూరు నుంచి భద్రాద్రికి..
నృత్యంతో ఆకట్టుకుంటున్న
దివ్యాంగుడు మహమ్మద్ నూర్ అలీఖాన్



ప్రదర్శనలిస్తున్న నూర్ ఆలీఖాన్

భద్రాచలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం కుటుంబాన్ని పోషించుకునేందు ఏపీలోని గుంటూరు సమీపంలోని గడ్డిపాడు నుంచి భద్రాచలంకు వచ్చి సినిమా పాటలకు నృత్యాలు చేస్తూ ఆకట్టుకుంటున్నాడు మహమ్మద్ నూర్ అలీఖాన్. దివ్యాంగుడైన నూర్ ఆలీఖాన్ చిరంజీవి సినిమా పాటలకు నృత్యం చేయడమే కాకుండా బాలకృష్ణ సినిమా డైలాగులను తనదైనశైలిలో హావభావాలతో ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నారు. ఇదే సమయంలో పాటలు సైతం పాడుతుండటం విశేషం. తాను గతేడేళ్ల క్రితం భద్రాచలం రావడం జరిగిందని, ఇది రెండోసారని తెలిపారు. చిన్ననాటి నుంచి తనకు పోలియో ఉందని ఈ క్రమంలో బాల్యం నుంచే స్వయంగా టీవీ ముందు కూర్చొని నేర్చుకున్నవే. తనకు వివాహం జరిగిందని ఒక బాబు ఉన్నాడని తెలిపారు. అంతేకాకుండా రీల్స్ కూడా చేస్తుంటానని, గణేష్, దసరా నవరాత్రి ఉత్సవాల సమయంలో ప్రత్యేక కార్యక్రమాలను తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు.

డిసెంబరు 20 నుంచి

వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు

దీపారాధనకు గోశాల పక్కన ఏర్పాట్లు
భద్రాచలం దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు



నదీ హారతి నిర్వహిస్తున్న దృశ్యం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈవో దామోదర్‌రావు

భద్రాచలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 20 నుంచి భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు తెలిపారు. సోమవారం భద్రాచలంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. డిసెంబరు 20 నుంచి జనవరి 9వరకు వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారన్నారు. 20 నుంచి 28 వరకు పగల్‌పత్తు ఉత్సవాలు, 29న తిరుమంగై ఆళ్వారు పరమపదోత్సవం, పవిత్ర గోదావరిలో స్వామివారికి తెప్పోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. 30న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తరద్వారంలో స్వామివారు తెల్లవారుజామున భక్తులు దర్శించుకునేందుకు దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 30నుంచి రాపత్తు ఉత్సవాలు ప్రారంభం కానుండగా జనవరి 30 నుంచి విలాసోత్సవాలు 12 వరకు నిర్వహిస్తారన్నారు. 15న సర్వదేవతా అలంకారం విశ్వరూప సేవ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇదిలా ఉండగా పగల్‌పత్తు ఉత్సవాలను పురస్కరించుకొని డిసెంబరు 20 నుంచి 30 వరకు ఆలయంలో నిత్యకల్యాణాలు నిలిపివేయడం జరిగిందన్నారు.

శివయ్యకు చందనాభిషేకం

కార్తీక సోమవారం పురస్కరించుకొని భద్రాచలంలోని రామాలయం అనుబంధ ఆలయమైన శ్రీ అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో చందనాభిషేకాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అంతకు ముందు పంచామృతాలతో స్వామి వారికి అభిషేకాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, అర్చకులు అయిలూరి సుబ్రమణ్యశర్మ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్రం పవిత్ర గోదావరికి నదీ హారతులను సైతం సమర్పించారు. ఈ సమయంలో పంచ హారతులను గోదావరికి వైదిక బృందం సంప్రదాయబద్ధంగా సమర్పించింది.

భక్తులు దీపారాధనకు గోశాల పక్కన ఏర్పాట్లు

కార్తీక దీపాలను పడేసిన పారిశుధ్య కార్మికురాలు అని ప్రచార మాధ్యమాల్లో వస్తున్న విషయంపై ఆయన మాట్లాడుతూ గత ఏడాది కాలంగా ఆలయ గాలిగోపురం పక్కన గల పొగడ చెట్టు వద్ద దీపాలను పెట్టడం నిలిపివేయడం జరిగిందన్నారు. చెట్టు మాడిపోయే అవకాశం ఉండటంతో పాటు గ్రీన్ భద్రాద్రి వారి సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకుని గోశాల పక్కన దీపారాధనలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో ఇటీవల పొగడ చెట్టు వద్ద కార్తీక దీపాలను గట్టుపై పెట్టి వెలిగించగా చెట్టుకు ఇబ్బంది అవుతుందనే ఆలోచనతో పారిశుధ్య కార్మికురాలు ఆ దీపాలను గట్టు కింద వాటిని పెట్టడం జరిగిందని, అంతేగాని భక్తులకు అసౌకర్యం కలిగించడం కాదన్నారు. ఆ వీడియోలో ఉన్న కార్మికురాలు గత దశాబ్ద కాలంపైగా దేవస్థానంలో పని చేస్తుందని ఆమె అన్యమతస్తురాలు కాదని పేర్కొన్నారు. భక్తులు దీపారాధన చేసుకునేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీ రామకృష్ణారావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్‌లు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు రజత గజ వాహనం

రూ.40 లక్షల విలువైన 31 కిలోల వెండితో తయారీ
అందజేసిన ప్రవాస భారతీయులు శంకర్‌నారాయణ, రాజ్యలక్ష్మి దంపతులు
వివరాలు వెల్లడించిన దేవస్థానం ఈవో దామోదర్‌రావు


రజత గజ వాహనంతో దేవస్థానం ఈవో, వైదిక సిబ్బంది

భద్రాచలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన ప్రవాస భారతీయులు రజత గజ వాహనాన్ని సమర్పించారు. ప్రస్తుతం అమెరికాలోని బోస్టన్‌లో నివాసం ఉంటున్న శంకర్ నారాయణ -రాజ్యలక్ష్మి దంపతులు రూ.40 లక్షలు వెచ్చించి 31కిలోల వెండితో గజ వాహనాన్ని తయారు చేయించారని దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో శృంగేరి పీఠం ఉత్తరాధికారి విదుశేఖరభారతి స్వామి చేతులమీదుగా అందుకున్న ఈవో సోమవారం ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. 2022లో శంకర్ నారాయణ- రాజ్యలక్ష్మి దంపతులు భద్రాద్రి రామయ్యను దర్శించి మంత్రముగ్ధులయ్యారని, ఈ క్రమంలో స్వామివారి సేవకు రజత గజ వాహనాన్ని సమర్పిస్తామని మొక్కుకున్నారని, ఇప్పుడు ఆ మొక్కు చెల్లించుకున్నారన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో శృంగేరిపీఠం ఉత్తరాధికారి విదుశేఖరభారతి స్వామి చేతులమీదుగా అందుకన్నామని, ఈ గజవాహనాన్ని స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సమయంలో వినియోగిస్తామని ఈవో దామోదర్‌రావు, వైదిక సిబ్బంది వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, స్థానాచార్యులు కేఈ స్థలసాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాల కోసం ఈ-పాస్

వెబ్‌సైట్ లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలి
జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జ్యోతి

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 2024-25 సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూల్స్‌లో చదువుతున్న 9, 10వ తరగతి బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాల మంజూరు కొరకు ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు సౌకర్యం కల్పించబడిం దని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి.జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10వ తరగతి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఆదాయ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్థి బ్యాంక్ పాస్ బుక్ (తల్లి లేదా తండ్రి జాయింట్ అకౌంట్‌తో తెరచి) జిరాక్స్ కాపీలను జతపరచాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో పూర్తిచేసిన దరఖాస్తుల వివరాలను ప్రింట్ తీసి, అట్టి దరఖాస్తులకు పైన తెలిపిన సర్టిఫికెట్స్ కాపీలను జతపరచి, కలెక్టరేట్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి కార్యాలయంలో అందించాలని తెలిపారు.

పెండింగ్ ఉపకార వేతనాల దరఖాస్తులు ఇవ్వాలి

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ, ప్రైవేటు, యూనివర్సిటీ ఇంజనీరింగ్, నర్సింగ్ కళాశాలలకు సంబంధించి 2017-18 నుంచి 2024-25 సంవత్సరాల వరకు పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలకు సంబంధించి, ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లు దరఖాస్తులను ఈనెల 20లోగా ఖమ్మం కలెక్టరేట్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి కార్యాలయంలో సమర్పించాల ని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి.జ్యోతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ట్యూషన్ ఫీజులకు సంబంధించి చాలా దరఖాస్తులు నో-ఫీజు అని ఈ-పాస్ వెబ్‌సైట్ లో చూపించడం జరుగుతున్నదని, కళాశాలల యాజమాన్యం సంబంధిత శాఖ సోషల్ వెల్ఫేర్‌లో గానీ లేదా పీఎంయూ సెంటర్‌ను సంప్రదించి సంబంధిత ఫీ-స్ట్రక్చర్‌ను ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. ఫీజు స్ట్రక్చర్‌ను అప్డేట్ చేసుకొని కళాశాలలకు ట్యూషన్ ఫీజు రాకపోతే, సంబంధిత కళాశాలల యాజమాన్యం పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని, అట్టి వారిపై శాఖాపరమైన చర్యల కోసం పై అధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందని తెలిపారు.

ఆయిల్‌పామ్ యాంత్రీకరణ పరికరాల కోసం

రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



కొత్తగూడెంఅర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ పంటల సాగును పెంచేందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ప్రత్యేక చొరవతో ప్రభుత్వం సమీకృత ఉద్యాన మిషన్‌లో భాగంగా ఆయిల్‌పామ్ సాగులో యాంత్రీకరణ పరికరాల కోసం రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. జిల్లాలో 83,041 ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగుచేస్తున్నారు. ఈ పంటను సాగు చేసే రైతులకు లబ్ధిచేకూర్చేందుకు మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు 50శాతం ఓబీసీ, పెద్ద రైతులకు 40శాతం రాయితీతో యంత్ర పరికరాలు మంజూరుచేయనున్నట్లు ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఖమ్మం జిల్లా అధికారి జంగ కిషోర్ తెలిపారు. ఉద్యాన పంటల యాంత్రీకరణ పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు సమీపంలోని ఉద్యాన అధికారులు, ఉద్యాన విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈనెల 10లోపు తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

50శాతం రాయితీపై అందించే పరికరాలు ఇవే..

పరికరం	అసలు ధర (రూ.లలో)	రాయితీ (శాతం)
ఆయిల్‌ఫామ్ గెలలు కోసే కత్తులు	5,000	50
మోటారుతో ఉపయోగించే ఉలి	15,000	50
గెలలు కోసేందుకు వినియోగించే నిచ్చెన	5,000	50
పవర్ వీడర్లు	50,000	50
ట్రాక్టర్లు, ట్రాలీలు	4,00,000	50

మైనింగ్, క్వారీ లీజుకు పర్యావరణ అనుమతికి సర్వే నివేదికపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాభిప్రాయాలకు జిల్లా వెబ్‌సైట్..
గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకుడు రమేష్

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మైనింగ్, క్వారీ లీజుల మంజూరుకు పర్యావరణ అనుమతికి అత్యంత ఆవశ్యకమైన జిల్లా సర్వే నివేదికను ప్రజాభిప్రాయం కోసం ఖమ్మం జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు ఇంచార్జ్ గనులు, భూగర్భశాఖ సహాయ సంచాలకులు ఏ.రమేష్ సోమవారం తెలిపారు. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, సుప్రీంకోర్టుల మార్గదర్శకాల మేరకు జిల్లా సర్వే నివేదికను రూపొందించినట్లు సహాయ సంచాలకులు తెలిపారు. జిల్లాలో ఉన్న చిన్న తరహా ఖనిజాలకు కొత్తగా క్వారీ లీజుల మంజూరు కావాలన్నా, ప్రస్తుతం నడుస్తున్న క్వారీ లీజుల రెన్యూవల్ కావాలన్నా పర్యావరణ అనుమతి తప్పనిసరని తెలిపారు. రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రభావ అధ్యయన సంస్థకు పర్యావరణ అనుమతులు మంజూరుకు ఈ జిల్లా సర్వే నివేదిక ఒక కరదీపిక, రెఫరెన్స్ డాక్యుమెంట్‌గా దోహదపడుతుందని తెలిపారు.జిల్లాలోని ఖనిజ వనరులు, క్వారీ లీజులు, భౌగోళిక స్వరూపం, వాతావరణ, శీతోష్ణస్థితి, వర్షాపాతం, వాగులు, వంకలు, అడవులకు సంబంధించి సమస్త సమాచారంతో ఈ నివేదికను ప్రజలకు సమాచారార్థం జిల్లా పోర్టల్‌లో ఉంచినట్లు, దీనిపై ఎలాంటి అభిప్రాయాలు వెల్లడించాలనుకున్న 21 రోజుల్లో తెలపాలని, తదుపరి అంతిమ జిల్లా సర్వే నివేదిక రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ అధ్యయన సంస్థ (సీయా) కు సమర్పించడం జరుగుతుందని గనుల, భూగర్భ శాఖ సహాయ సంచాలకులు తెలిపారు.

వీడని మిస్టరీ..

పోలీసులకు సవాల్‌గా మారిన రామారావు హత్య కేసు
సీసీ పుటేజీలో నెంబర్ ప్లేట్ లేని కారు గుర్తింపు
సోమవారం 5గంటల పాటు సమీక్ష నిర్వహించిన సీపీ సునీల్‌దత్

చింతకాని, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): సంచలనం రేపిన సీపీఎం రాష్ట్ర నాయకుడు, పాతర్లపాడు మాజీ సర్పంచ్ సామినేని రామారావు హత్యకేసు మిస్టరీ వీడలేదు. హత్య జరిగి నాలుగు రోజులవుతున్నా నిందితుల ఆచూకీ లభించలేదు. ఘటన జరిగినప్పటి నుంచి పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నారు. రాజకీయ నేతలు, కుటుంబ సభ్యులు లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు పక్కా ప్రణాళికతో చేసిన ఈ హత్యలో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో పోలీసులకు ముచ్చెటమలు పడుతున్నాయి. ఘటనాస్థలంలో దొరికిన ఆధారాలు అంతగా ఉపయోగపడక పోవడం, డాగ్‌స్క్వాడ్ పరిశీలనలో బహిరంగంగా కనిపించేంత సాక్ష్యాలు లభించక పోవడంతో ఈ కేసుచేధన పోలీసులకు సవాల్‌గా మారింది.

అనుమానం ఉన్న ప్రతి ఒక్కరినీ విచారిస్తున్న పోలీసులు

హత్య కేసుకు సంబంధించి ఏ ఒక్క క్లూ వదలకుండా పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు పాతర్లపాడు గ్రామస్థులతో పాటు, పక్క గ్రామాల వారిని, పలు షాపుల యాజమానులను విచారించారు. నాగులవంచ మెయిన్‌రోడ్, రైల్వేగేటు వద్ద ఉన్న సీసీ కెమెరాల రికార్డులను స్వాధీనం చేసుకున్న పోలీసులు ప్రతీ దృశ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. రైల్వే గేటు సమీపంలో హత్య జరిగిన రోజు ఉదయం 6.30గంటల సమయంలో రికార్డు అయిన సీసీ వీడియో పుటేజీలో ఓ అనుమానితుడి కదలికలను పోలీసులు గుర్తించారు. నాగులవంచ- రేల్వేకాలనీ రోడ్డు ద్వారా పాతర్లపాడు గ్రామంలో హత్యకు కొన్ని గంటల ముందు నెంబర్ ప్లేట్‌లేని ఓ కారు కదలికలను సీసీ పుటేజీలో పోలీసులు గుర్తించినట్లు సమాచారం. సీసీ పుటేజీలో అనుమానితుడి ముఖం గుర్తించేందుకు వీలుగా లేకపోవడం, కారుకు నెంబర్ ప్లేట్ లేకపోవడంతో ఈ కోణంలో కేసు దర్యాప్తు ముందుకు సాగేలా కనిపిండంలేదు.

పాతర్లపాడులో నిశ్శబ్ద వాతావరణం

పాతర్లపాడులో నిశబ్ధ వాతావరణంతో అలుముకుంది. హత్యకు రాజకీయ మరకలు అంటుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు నిత్యం పహారా కాస్తున్నారు. ముమ్మర వ్యవసాయ పనుల నేపథ్యంలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ గ్రామంపై ప్రత్యేక నిఘా ఉంచారు. రామారావు హత్య చేసిందెవరు, ఎందుకు చేశారు అన్న ప్రశ్నలువేధిస్తున్నా.. సమాధానం, నిందితుల కోసం ఎదురుచూపులు తప్పడంలేదు.

కేసుపై సీపీ సునీల్‌దత్ సమీక్ష

రామారావు హత్య కేసుపై సీపీ సునీల్‌దత్ సోమవారం చింతకాని పోలీస్ స్టేషన్‌లో సుమారు 5గంటల పాటు సమీక్ష నిర్వహించారు. కేసు పురోగతి, విచారణపై ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసు విచారణలో వేగం పెంచి, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిందితులను త్వరగా పట్టుకోవాలని సూచించారు.

మేన 'బంధాన్ని' మరిచి..

చెల్లిని కాపురానికి తీసుకెళ్లడం లేదని బావపై కత్తితో దాడి
అడ్డుకోబోయిన మేనత్తకూ కత్తిపోట్లు.. అక్కడికక్కడే మృతి
ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బావ
తన మేనమామతో కలిసి ఘాతుకం
ఏదులాపురం ముత్తగూడెంలో ఘటన


సంఘటనా స్థలంలో నాగమణి మృతదేహం


గునిగంటి నాగమణి (ఫైల్)

ఖమ్మంరూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భార్యాభర్త మధ్య ఏర్పడిన మనస్పర్థలు.. ఇరు కుటుంబ మధ్య కలహాలకు దారితీసి.. ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. తన చెల్లిని కాపురానికి తీసుకుపోవడంలేదని, ఆమె అంటే తనకు ఇష్టం లేదని చెప్పిన బావపై కక్ష పెంచుకున్న బావమరిది తన మేనమామతో కలిసి బావ కళ్లల్లో కారం చల్లి కల్లుగీసే కత్తులతో దాడి చేశాడు. దాడిని అడ్డుకోబోయిన అత్తనూ (బావ తల్లి) కత్తితో దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలొదిలింది. ఈ సంఘటన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడెం గ్రామంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముత్తగూడెం గ్రామానికి చెందిన గునిగంటి నాగమణి(45) కుమారుడు మహేశ్‌కు అదే గ్రామంలో ఉంటున్న తన అన్న మోటపోతుల వెంకటేశ్వర్లు కుమార్తె అఖిలను ఇచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. పెళ్లయిన కొద్దిరోజులకే ఇద్దరి మధ్య మనస్పర్థలు ప్రారంభం కావడంతో మహేశ్ కోర్టుకు వెళ్లగా ఏడాది క్రితం వారికి విడాకులు మంజూరయ్యాయి. అయినప్పటికీ మేనరిక సంబంధం కావడంతో అఖిల కుటుంబసభ్యులు తమ కూతురిని అత్తారింటికి పంపేందుకు ప్రయత్నిస్తున్నారు. పెద్దమనుషుల ద్వారా పలువమార్లు సంప్రదింపులు కూడా జరిపారు. ఈ క్రమంలోనే వారు సోమవారం ఉదయం అఖిలను తీసుకుని ఆమె తండ్రి వెంకటేశ్వర్లు, తల్లి అనిత, సోదరుడు మనోజ్.. నాగమణి ఇంటికి వెళ్లారు. తమ కూతురిని కాపురానికి పంపడానికి వచ్చామని వారు చెప్పగా..అఖిల భర్త మహేశ్ తనకు అఖిల అంటే ఇష్టం లేదని, ఆమె తన ఇంటికి రావడానికి వీల్లేదని మహేశ్ తెగేసి చెప్పాడు. దీంతో వారు అఖిలను తీసుకుని తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. అయితే తన చెల్లిని కాపురానికి తీసుకెళ్లడం లేదని, ఆమె అంటే ఇష్టం లేదని చెప్పడంతో బావపై కోపం పెంచుకున్న మనోజ్ కొంత సమయం తరువాత తన మేనమామ అయిన డోర్నకల్ మండలం సంకీస గ్రామానికి చెందిన హెల్ది వెంకన్నను తీసుకుని కల్లుగీసే కత్తులు, కారంపొడి, కర్రలు తీసుకుని ద్విచక్రవాహనంపై నాగమణి ఇంటికి వచ్చాడు. వచ్చారాగానే బావ మహేశ్ కంట్లో కారంపొడి కొట్టి కత్తులతో దాడి చేశారు. తన కుమారుడిపై జరుగుతున్న దాడిని నాగమణి అడ్డుకోబోగా.. ఆమెను కూడా కత్తితో విచక్షణారహితంగా పొడవడంతో నాగమణి అక్కడికక్కడే మృతి చెందింది. గొడవ జరుగుతుండటాన్ని గమనించిన స్థానికులు అక్కడికి చేరుకోవడంతో మనోజ్, వెంకన్న అక్కడినుంచి పరారయ్యారు. తీవ్ర గాయాలతో ఉన్న మహేశ్‌ను వెంటనే ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఖమ్మం రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నాగమణి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాగమణి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

మద్యానికి డబ్బులివ్వలేదని..

గొడ్డలితో దాడి చేసిన తల్లిని హతమార్చిన కొడుకు
తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో ఘటన


భూబా (ఫైల్)

తిరుమలాయపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నవ మాసాలు మోసి.. కనీ పెంచి పోషించిన తల్లికి అండగా ఉండాల్సిన ఆ కుమారుడు విచక్షణ మరిచిపోయాడు. మద్యానికి బానిసై కన్నబంధాన్ని మరిచి దారుణంగా తల్లినే హతమార్చాడు. ఈ విషాదకర సంఘటన ఖమ్మంజిల్లా తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలివీ.. తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామానికి చెందిన మందుల భూబా(50) వ్యవసాయకూలీ పనిచేస్తూ జీవిస్తోంది. కొన్నేళ్ల క్రితం భర్త మృతిచెందగా.. కుమారుడు మధుకు పెళ్లి చేసింది. అతడి ప్రవర్తన బాగా లేకపోవడంతో భార్య రెండేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. రేచీకటి సమస్య ఉన్న మధు మద్యానికి బానిసై తరచూ తల్లితో గొడవ పడుతుండేవాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం రాత్రి 9గంటల సమయంలో మద్యం మత్తులో ఇంటికి వచ్చిన మధు తల్లిని మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని కోరాడు. ఆమె ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో భూబా ఇంటి ఎదురుగా ఉన్న జామచెట్టుకిందకు వెళ్లి కూర్చోగా.. మధు ఆమెపై గొడ్డలితో దాడి చేయగా ఆమె మృతిచెందింది. ఆ తర్వాత మధు ఇంట్లోకి వెళ్లి నిద్రించాడు. అయితే సోమవారం ఉదయం 6గంటల సమయంలో నిద్రలేచిన మధు తాను రాత్రి తల్లితో గొడవపడ్డానని, ఆమె విగతజీవిగా పడిఉందని తమ ఇంటి సమీపంలో ఉండే తన మేనమామ నల్లగట్టు కాశయ్యకు వివరించాడు. దీంతో కాశయ్య పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ముదిగొండ సీఐ మురళి, తిరుమలాయపాలెం ఎస్ఐ కూసుపుడి జగదీష్ అక్కడికి వివరాలు సేకరించారు. భూబా మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. నిందితుడు మధును అదుపులోకి తీసుకున్నారు. కాశయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

ఇల్లెందు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కార్యకర్తల మధ్య తలెత్తిన ఆర్థిక లావాదేవీల వివాదంతో మనసానికి గురైన పార్టీ సోషల్‌మీడియా కార్యకర్త సత్తాల హరికృష్ణ సోమవారం మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బీఆర్‌ఎస్‌కు చెందిన హరికృష్ణ, పాలడుగు రాజశేఖర్‌లు బంగారం కుదవబెట్టుకున్న ఆర్థిక లావాదేవీల్లో వివాదం తలెత్తింది. దీంతో రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు హరికృష్ణను పోలీసుస్టేషన్లో విచారిరచడంతో మనస్థాపానికి గురై ట్యాబ్లేట్లు మింగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం. అతనికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

దంపతులకు గాయాలు

జూలూరుపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభానికి కారు ఢీకొనడంతో దంపతులకు గాయాలైన సంఘటన మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా.. ఖమ్మంకు చెందిన కోవెల అజిత్‌కుమార్, భార్య వరలక్ష్మిలు టీఎస్04 ఈవై1333 నెంబర్ గల కారులో ఖమ్మం నుంచి భద్రాచలం రామాలయానికి వెళుతున్నారు. ఈ క్రమంలో కారు అదుపు తప్పడంతో పడమట నర్సాపురంలోని బేతాళపాడు క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో విద్యుత్ స్తంభం విరిగిపోవటమే కాక దంపతులిద్దరికీ స్వల్పగాయాలయ్యాయి.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

అక్కా తమ్ముడికి తీవ్ర గాయాలు

కారేపల్లి నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన సంఘటన సోమవారం మండల పరిధిలోని అప్పాయిగూడెం వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మాధారం పంచాయతీ పరిధిలోని గోవింద్‌తండాకు చెందిన విఘ్నేశ్వరి, ఆమె తమ్ముడు వినయ్‌లు ద్విచక్రవాహనంపై ఇల్లందులోని ఓ ప్రైవేట్ కళాశాలకు వెళ్తుండగా అప్పాయిగూడెం వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న విఘ్నేశ్వరికీ, ఆమె తమ్ముడు వినయ్‌కు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వారిని 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఢీకొట్టి వెళ్లిపోతున్న లారీని ఆపి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఖమ్మం రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ అంజలి

ఖమ్మంక్రైం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తుల నుంచి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు జీఆర్పీ సీఐ ఎన్.అంజలి తెలిపారు. ఖమ్మం రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ కార్యాలయంలో సోమవరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ ఆర్‌పీఎఫ్ పోలీసుల, జీఆర్పీ పోలీసులు రైల్వేస్టేషన్ రెండో నెంబరు ప్లాట్‌ఫారంపై సోమవారం తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిస్సా రాష్ట్రానికి చెందిన సోమంత్ నాగ, సుశీల్‌కనుర లు అనుమానాస్పదంగా రెండు బ్యాగులతో కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకని తనిఖీచేయగా ఐదు గంజాయి ప్యాకెట్లు గుర్తించినట్లు తెలిపారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిస్సాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలుచేసి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ద్వారా షోలాపూర్‌కు వెళ్తున్న నేపథ్యంలో రైల్వే టీసీని చూసి భయంతో ఖమ్మంలో దిగినట్టు చెలిపారని సీఐ చెప్పారు. దీంతో వారిని ఖాజీపేట రైల్వేకోర్టుకు పంపి రిమాండ్‌కు తరలించామని పట్టుబడిన గంజాయి సుమారు 10 కేజీల 180 గ్రామలుందని, దాని విలువ రూ.5,15,000 ఉంటుందని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌పీఎఫ్ సీఐ సురేస్‌గౌడ్, ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



తుది దశకు మాస్టర్ ప్లాన్



- 45 రెవెన్యూ గ్రామాలు, 571.83 చదరపు విస్తీర్ణంలో ముసాయిదా
- అభ్యంతరాల స్వీకరణకు నేటితో ముగుస్తున్న గడువు

ఖమ్మంకార్పొరేషన్,నవంబరు3(ఆంధ్రజ్యోతి): స్తంభాద్రిఅర్బన్‌డెవెలప్‌మెంట్ (సుడా)ప్రాంతం పరిధి ఇక దాదాపుగా జిల్లా వ్యాప్తంగా పెరగనుంది. నిన్నటి వరకు ఖమ్మం నగర పాలక సంస్థ, వైరా మున్సిపాలిటీతో పాటుగా జిల్లా కేంద్రానికి సమీపంలోని 44గ్రామపంచాయతీలు మాత్రమే సుడాపరిధిలో ఉన్నాయి. ముఖ్యంగా సుడా పరిధిలోని ప్రాంతాలు అర్బన్ ప్రాంతంగా గుర్తింపు జరిగి కొన్ని సాంకేతిక అంశాలు తొలగిపోతాయి. తద్వారా పరిశ్రమలు, కర్మాగారాలు రావటానికి వీలు కలుగుతుంది. భూముల ధరలు పెరుగుతాయని జిల్లా ప్రజలు సుడా నూతన మాస్టర్ ప్లాన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈక్రమంలోనే సుడా వైస్‌చైర్మన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య నూతన మాస్టర్ ప్లాన్‌తు ముసాయిదాను ప్రకటించారు. 90 రోజులు గడువుతో నోటిఫికేషన్ విడుదల చేశారు. మంగళవారంతో అభ్యంతరాలు స్వీకరణకు గడువు ముగుస్తోంది.

2017లో సుడా ఏర్పాటు

2017అక్టోబరు17న సుడాను ఏర్పాటు చేశారు. ఖమ్మం నగర పాలక సంస్థతో పాటుగా వైరా మున్సిపాలిటీ, ఖమ్మంరూరల్ 18గ్రామ పంచాయతీలు, కూసుమంచి 2జీపీలు, ముదిగొండ 5జీపీలు, చింతకాని 6జీపీలు, కొణిజర్ల 7జీపీలు రఘునాథపాలెం 6జీపీలతో సుడాను నిర్మాణం జరిగింది. అయితే 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సుడా పాలక వర్గాన్ని రద్దు చేసింది. చైర్మన్‌తో పాటుగా 14మంది డైరక్టర్లు తొలగిపోయారు. అక్కడ పని చేస్తున్న ఉద్యోగులను మాత్రం ఖమ్మం నగర పాలక సంస్థలో కొన్నివిభాగాలకు కేటాయించారు.

ఆగష్టు 6న నోటిఫికేషన్

ఖమ్మంమాస్టర్‌ప్లాన్ అమోదానికి ముందుగా ప్రజాభిప్రాయ సేకరణకు 6.8.2025 న ఖమ్మం సుడా ద్వారా నోటిఫికేషన్ విడుదల చేశారు. ఖమ్మం నగర పాలక సంస్థ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఉంచారు. కేఎంసీ కార్యాలయంలోను నోటీసు బోర్డులు ప్రదర్శించారు. అభ్యంతరాలు ఉంటే 90రోజుల్లోగా అభ్యంతరాలను తెలియజేయాలని సుడావైస్‌చైర్మన్ కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య కోరారు. కాగా తుదిగడువు మంగళవారంతో ముగుస్తోంది.

నూతన మాస్టర్ ప్లాన్‌లో ప్రాంతాలు ఇలా..

సుడాపరిధిలో ఖమ్మం మునిసిపాలిటీతో పాటు ఏదులాపురం మునిసిపాలిటీ, వైరా మున్సిపాలిటీతోను 45రెవెన్యూ గ్రామాలు, 571.83 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో మాస్టర్ ప్లాన్ తయారు చేశారు.కొన్నిగిరిజన ప్రాంతాలు కాకుండా జిల్లాలోని పట్టణీకరణకు అనుకూలంగా ఉండే ప్రాంతాలన్నీ సుడా పరిధిలోకి తీసుకొచ్చారు.

ఖమ్మం అర్బన్ మండలంలో:

పాకబండ, బుర్హాన్‌పురం, ఖానాపురం హవేలి, దంసలాపురం, వెలుగుమట్ల, మల్లేమడుగు, బల్లేపల్లి, కొత్తగూడెం, అల్లీపురం, కైకొండాయిగూడెం, గొల్లగూడెం, మరియు దాన్వాయిగూడెం గ్రామాలు ఉన్నాయి.

ఖమ్మం రూరల్‌లో:

గూడురుపాడు, తీర్థాల, గోళ్లపాడు, వెంకటాయపాలెం,ఆరెంపుల, ముత్తగూడెం, పల్లేగూడెం, పోలేపల్లి,ఏదులాపురం,బారుగూడెం,తల్లంపాడు, మద్దులపల్లి,తెల్దారుపల్లి, గుర్రాల పాడు, వెంకటగిరి,గుదిమళ్ల,దారేడు,కామంచికల్ ఉన్నాయి.

కూసుమంచిలో:

జీళ్లచెర్వు, కూసుమంచి రెవెన్యూ గ్రామాలు.

ముదిగొండలో:

ముదిగోండ, సువర్ణపురం, ఖానాపురం, న్యూ లక్ష్మీపురం, వెంకటాపురం.

చింతకానిలో:

వందనం, కొదుమూరు, లచ్చగూడెం, బస్వాపురం, పందిళ్లపల్లి, చింతకాని ఉన్నాయి

కొణిజర్లలో:

తనికెళ్ల, కొణిజర్ల,అమ్మపాలెం, లలింగగూడెం, గుంద్రాతి మడుగు, దిద్దిపూడి, పల్లిపాడు

వైరాలో:

సోమవారం, వైరా, లాలాపురం,

రఘునాథపాలెంలో:

చిమ్మపూడి, మంచుకొండ, కోయచెలక, రేగులచెలక, వీవెంకటాయపాలెం, రఘునాథపాలెం ఉన్నాయి

నూతన సుడాకు సరిహద్దులు

ఉత్తరం:

జన్నారం, గుర్రాలకుంటా, సీతారామాపురం, పాపటపల్లి, కొంపల్లి

తూర్పులో:

మల్లారం,రెడ్డిగూడెం,పడమటిమెట్ట,సిరిపురం

దక్షణంలో:

పాతర్లపాడు, వల్లాపురం, రేపల్లెవాడు

పడమరలో:

పాలేరు, జుజ్జురావుపేట, పోచారం.

100కు పైగా ఫిర్యాదులు

89 రోజులు సుడా ఫిర్యాదుల స్వీకరణలో 100కు పైగా అభ్యంతరాలు, ఫిర్యాదులు, వినతులు అందాయి. వాటిలో ఆన్‌లైన్ మరియు అధికారులకు నేరుగా ఫిర్యాదులు చేశారు. ముఖ్యంగా ఖమ్మం నగరంలో ప్రస్తుత సుడా మేరకు ఉన్న 180 అడుగుల రహదారిని తొలగించి, ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలని, పరిశ్రమల జోన్‌లో మార్పులు చేయాలని, రహదారుల విస్తీర్ణాన్ని తగ్గించటం లేదా పెంచాలని గతంలో వాటర్ బాడీల పరిధిలో ఉన్న సాగునీటి కాల్వలను ఇప్పుడు తొలగించి ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. మంగళవారం తుదిగడువు కావటంతో ఈ మేరకు సుడావైస్ చైర్మన్ మరోసారి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రజలు అభ్యంతరాలు, ఆక్షేపణలు, వినతులు ఉంటే తెలియజేయాలని కోరారు.

ఘనంగా కార్తీక సోమవారం పూజలు



ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా నగరంలోని పలు శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే భక్తులు ఆలయాలకు చేరుకోని అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామును 3గంటల నుంచి శివాలయాలలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. గుంటుమల్లేశ్వర స్వామి ఆలయం, ఎస్పీఆఫీస్ రోడ్డులోని శివాలయం, బ్రాహ్మణబజారు శివాలయం, నగరంలోని కైకొండాయిగుడెం వద్ద గల శ్రీవిశాలక్షీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, తీర్థాల సంఘమేశ్వరస్వామి ఆలయం, కూసుమంచి శివాలయం, బైపాస్ రోడ్‌చైతన్యనగర్, శ్రీనివాసనగర్‌లోని అయ్యప్ప ఆలయాలలో స్వాములు, భక్తులు దీపాలు వెలిగించారు. జిల్లాలోని పలు శివాలయాలలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు సాయంత్రం ఆకాశంలో నక్షత్రాలు కనిపించన అనంతరం ఉపవాస దీక్ష విడిసి భోజనాలు చేశారు. ఈమాసంలో చేసే పూజలు, దానాలు, ఉపవాసాలు వల్ల విశేషమైన ఫలితాలు లభిస్తాయని భక్తుల నమ్మకం. కొందరు భక్తులు దగ్గరలోని నదులలో స్నానమాచరించి దీపాలు వెలిగించారు. ఆలయాలలో సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

ప్రభుత్వాస్పత్రిలో ఎలక్ట్రానిక్ టోకెన్ వ్యవస్థ ప్రారంభం

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు పూర్తి సహాయక సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు హెల్ప్ డెస్క్‌లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎం.నరేందర్ తెలిపారు.హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సహకారంతోపేషెంట్ సపోర్ట్ సర్వీసెస్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం ఆయన జీజీహెచ్‌లో ఎలక్ట్రానిక్ టోకెన్ సిస్టంతో పాటు ప్రత్యేక సహాయక కేంద్రాలను ప్రారంభించారు. వీటి ద్వారా రోగులకు రిజిస్ట్రేషన్లు, ఫార్మసీ సహాయంతో పాటు ఏఏ సేవలు ఎక్కడ అందిస్తారనే సమాచారాన్ని హెల్ప్ డెస్క్ ద్వారా అందుతాయన్నారు. నిత్యం 2వేల నుంచి 2వేల 500 వరకు రోగులు జనరల్, మెటర్నిటీ ఆసుపత్రుల విభాగానికి వస్తున్నారని, రోగులసంఖ్యకు తగిన విధంగా ఈ సేవలను అందిస్తోన్నట్లు తెలిపారు. నేటి నుంచి జనరల్ ఆసుపత్రి, మాతృశిశువిభాగంలో పూర్తిగా సమగ్ర ఎలక్ట్రానిక్ టోకెన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యకళాశాల ప్రిన్సిపాల్ టి.శంకర్, సీనియర్ వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేందర్

ఫిర్యాదులు స్వీకరించిన మేయర్

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): విలీన ప్రాంతాలు నగరంలో కలవటంతో సమస్యలు కూడా పెరుగుతున్నాయని అయినా ఎప్పటికప్పుడు రహదారులు, డ్రైయినేజీలు నిర్మాణాలు చేస్తున్నామన4 మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 2గంటల పాటు ప్రజలకు సమయం కేటాయించి ప్రతీ ఫిర్యాదుదారుతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించాలని, రెవెన్యూ, పట్టణా ప్రణాళిక, ఇంజనీరింగ్, పారిశుధ్యం, మెప్మా అధికారులకు సూచించారు. ఓ మహిళ ఫిర్యాదురాలు తన సమస్యను పరిష్కరించటం లేదని, పట్టణ ప్రణాళిక అధికారిపై గొడవ చేయటంతో మేయర్ శాంతింపచేశారు. డిప్యూటి కమిషనర్ శ్రీనివాస్,పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధర, ఏవో శ్రీనివాసరెడ్డి, డీఈ దరణి, మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కార్పొరేటర్ గజ్జల లక్ష్మీ

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హత కలిగిన వారందరికి ఆరుగ్యారెంటీ పథకాలతో పాటుగా అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని 28వ డివిజన్ కార్పొరేటర్ గజ్జలలక్ష్మీ పేర్కొన్నారు. సోమవారం డివిజన్‌లోని లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి షాదిముబారక్, కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గజ్జలలక్ష్మీ, కాంగ్రెస్‌నాయకులు గజ్జల వెంకన్న మాట్లాడుతూ మురికివాడగా ఉన్న 28వడివిజన్‌ను వ్యాపార కేంద్రంగా మారుతుందని వివరించారు. రహదారులు, డ్రైయినేజీల విస్తరణతో పాటుగా మార్కెట్‌కు రవాణా ఇబ్బందులు తొలగించేందుకు60 అడుగుల రహదారికి నిధులు కేటాయించారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు అంకాల వీరభద్రం, మహమ్మద్ జహీర్, పత్తికొండ శ్రీనివాసులు, ఖదిరుల్లా, సుంకర సతీష్, బాశెట్టి నాగేశ్వర రావు, గడుదలవెంకటేష్, గంగరబోయిన రవి, అందె సాయి, నర్సింహారావుపాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న గజ్జల లక్ష్మీ

7న రిటైర్డ్ ఉద్యోగుల 'చలో హైదరాబాద్'

కూసుమంచి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నవంబరు 7న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య, జిల్లాకార్యదర్శి తాళ్లూరి వేణు తెలిపారు. సోమవారం కూసుమంచిలో పోస్టర్ ఆవిష్కరించారు. పెన్షనర్లకు రావల్సిన జీపీఎఫ్, గ్రాడ్యుటీ సరెండర్ లీవ్, ఇతర ఆర్థి ప్రయోజనాలను విడుదల చేయకుండా మానసికంగా ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. దీంతో సమస్యల పరిష్కారానికి చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నందున విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రావిళ్ల రామయ్య, అప్పారావు, నర్సయ్య, రాంరెడ్డి, నాగులు పాల్గొన్నారు.



ప్రజావాణి ఫిర్యాదులపై దృష్టిసారించాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజల నుంచి అందే ప్రతీ ఫిర్యాదు పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఆమె అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలాల నుంచి తమ సమస్యల పరిష్కారానికి జిల్లాకేంద్రానికి వచ్చి ఫిర్యాదు చేసిన ప్రజలకు అధికారులు జవాబుదారీగా పనిచేయాలన్నారు. కాగా మొంథా తుఫానుకు సర్వం కోల్పోయిన రైతులకు పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ప్రజావాణాలో రైతు సంఘం తరపున, వినతి పత్రాన్ని అందజేశారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

విద్యాశాఖపై సమీక్షించిన అదనపు కలెక్టర్లు

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం విద్యాశాఖపై అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. ప్రతీ మండలంలో విద్యా సంస్థలను నవంబరు7నాటికి పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలన్నారు. పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల హెడ్‌మాస్టర్‌లకు ప్రత్యేకమార్గదర్శకాలు జారీ చేసి పరిశుభ్రత పాటించేలా చూడాలని అన్నారు. ప్రతీవిద్యార్థికి ఆధార్‌కార్డు, అపార్ నెంబర్ జనరేట్ చేయాలని అన్నారు. ఆర్బీఎస్కే ద్వారా పిల్లలకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షల వివరాలను ఆన్‌లైన్ లో అప్ లోడ్ చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలేని 3పాఠశాలలకు విద్యుత్ కనెక్షన్లు, 2పాఠశాలలకు తాగునీటి సరఫరా,7పాఠశాలలకు గర్ల్స్‌టాయిలెట్స్, 76 బాయ్స్ టాయిలెట్స్ నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈసమావేశంలో డీఆర్వో ఏ.పద్మశ్రీ, డిప్యూటీ సీఈఓ నాగపద్మజ, జ్యోతిబాపూలే ఆర్సీవో,బీసీ సంక్షేమ అధికారి జి.జ్యోతి, మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్, డీటీడబ్ల్యూఓ. విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో యువత స్వయం ఉపాధి కోర్సుల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 3నెలల శిక్షణ కాలపరిమితి కలిగిన కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సులకు ఈనెల మొదటి వారం నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభమవుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9948207271 ఫోన్ నెంబరుని సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ ఇద్దరికి గాయాలు

ఖమ్మంక్రైం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి.సోమవారం ఖమ్మం నగరంలో జరిగింది.ముదిగొండ మండలం పెద్దమండవకు చెందిన కుక్కల ఫిలిప్, గుండెపోగు కళ్యాణ్ ద్విచక్రవాహనం పై వెళ్తుండగా కొత్త బస్టాండ్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఓ లారీ ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి త్రీవ గాయాలు కాగా స్థానికులు నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించారు.

ఫీజురీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయాలి

బీజేపీజిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు

ఖమ్మంబైపాస్‌రోడ్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.8వేల కోట్ల ఫీజురీయింబర్సుమెంట్, స్కాలర్‌షిప్‌బకాయిలుపెండింగ్‌లో ఉన్నాయన్నారు. తక్షణమే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ కాలేజీల బంద్ సంపూర్ణం

(5వ పేజీ తరువాయి)

రూ.1200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలలో రూ. 900 కోట్లను విడుదల చేసి, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చుకోకపోవడంతో జిల్లాలోని కళాశాలల పరిస్థితులు దారుణంగా మారాయి. కళాశాలల భవనాల అద్దెలు, అధ్యాపకుల, సిబ్బంది జీతభత్యాలు, కాలేజీ బస్సుల నిర్వహణ, అన్ని ల్యాబ్‌ల నిర్వహణ, విద్యార్థినుల భద్రత, ఫర్నిచర్ కొనుగోళ్లు, కరెంటు చార్జీలు.. తదితర విద్యా వనరులను నిర్వహించడం యాజమాన్యాలకు తలనొప్పిగా మారింది. కళాశాలల నిర్వహణకు యాజమాన్యాలు ప్రతి నెల నెలా అప్పులపాలు కావాల్సిన దుస్థితి నెలకొంది. అప్పుల భారంతో కళాశాలలను నిర్వహించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందించడానికి కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ.. నిర్వహిస్తున్న కళాశాలల బంద్‌కు విద్యార్థి సంఘాలు, సామాజిక సంస్థలు తమ సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నాయి.

బకాయిలు చెల్లించేంతవరకూ నిరవధిక బంద్

ప్రైవేటు కళాశాలల మేనేజ్మెంట్

రాష్ట్రప్రభుత్వం ప్రైవేటు కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా చెల్లించేంత వరకూ కళాశాలల బంద్ నిరవధికంగా కొనసాగుతుంది. రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం ఇవ్వకపోవడంతో తాము కళాశాలలను నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. ఎస్సీ, ఎస్టీ , బీసీ, మైనార్టీ విద్యార్థులకు అత్యుత్తమ నైపుణ్యాలను అందిస్తున్న ప్రైవేటు వృత్తి విద్యా కళాశాలలకు ప్రభుత్వం అండగా నిలిచి ఆర్థిక భరోసా కల్పించాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయాలి. ఈనెల 10లోగా బకాయిలు విడుదల చేయాలని లేని పక్షంలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి తాము కూడా హైదరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తాం.

16న 'మట్టి పువ్వు' పుస్తకావిష్కరణ

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల16న ఆదివారం సాయంత్రం ఖమ్మంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో మట్టి పువ్వు పుస్తకావిష్కరణసభ జరుగుతుందని ప్రజాసంస్కృతి ద్వెమాసిక సాహిత్య ఎడిటర్ ఎన్.అరుణ తెలియజేశారు. సీనియర్ పాత్రికేయుడు ఎస్.తిర్మల్ రచనల్లో 14వ పుస్తకంగా విశిష్ట రచన,స్వీయ వచన సంపుటి మట్టిపువ్వు పుస్తకంగా రూపుదిద్దుకున్నదని తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా ఎకనామిక్స్ బోధించడానికి పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకిరుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న గురువారం సాయంత్రం 5గంటల వర వరకు, సంబంధిత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లతో దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఇంటర్వ్యూ శుక్రవారం ఉదయం పదకొండు గంటల నుంచి నిర్వహిస్తామని తెలిపారు.పీజీలో 55శాతం,నెట్,సెట్, పీహెచ్‌డీ, డిగ్రీ బోధనానుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

నాయకన్‌గూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కూసుమంచి,నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కూసుమంచి ఏవో రామడుగు వాణి తెలిపారు. నాయకన్‌గూడెం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ రవికుమార్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీవో రామచంద్రరావు, స్థానిక పెద్దలు వీరారెడ్డి, ఏపీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేలకొండపల్లి, కూసుమంచిలో సీపీఎం ర్యాలీ

రామారావు హత్య నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్

నేలకొండపల్లి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్రనాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సామినేని రామారావును హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సామినేని హత్యను నిరసిస్తూ సోమవారం సీపీఎం కార్యకర్తలు నేలకొండపల్లిలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు ఏటుకూరి రామారావు, భూక్యా కృష్ణ, యలమద్ది లెనిన్, బెల్లం లక్ష్మీ, రచ్చా నర్సింహారావు, రాసాల కనకయ్య, పెద్దిరాజు నర్సయ్య, మందడపు మురళీకృష్ణ, బలుసు ప్రమీల, సామాల మల్లికార్జున్, గురజాల వెంకటేశ్వర్లు, దుగ్గి వెంటేశ్వర్లు, వాసంసెట్టి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: రామారావు హత్యను ఖండిస్తూ కూసుమంచిలో ఆపార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ మాట్లాడుతు హత్యోదంతం చోటుచేసుకుని నాలుగు రోజులైనా నిందితులను పట్టుకోలేకపోయారని ఆరోపించారు. ఇది అసమర్థ కాంగ్రెస్ పాలనకు నిదర్శనమని తెలిపారు. వెంటనే నిందితులను పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలకార్యదర్శి తోటకూరి రాజశేఖర్, నాయకులు మల్లెల షన్మతి రావు, బిక్కసాని గంగాధర్, శీలం గురుమూర్తి, గన్యానాయక్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు



కూసుమంచిలో..

క్రీడలతో మానసికోల్లాసం

తహసీల్దార్ వెంకటేశ్వర్లు

నేలకొండపల్లి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని కొత్తకొత్తూరులోని ఎస్ఎఫ్ఎస్‌లో మండలస్థాయి పాఠశాలల క్రీడలను తహసీల్దార్ సోమవారం ప్రారంభించారు. మండల విద్యాధికారి బాలిన చలపతిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు సైతం అంతే ముఖ్యమన్నారు. తొలిరోజు బాలికలకు కబడ్డీ, వాలీబాల్,ఖోఖోపోటీలు నిర్వహించారు.మంగళవారం బాలురకు పోటీలను నిర్వహిస్తారు. తహసీల్దార్ బాలికలతో కబడ్డీ ఆడి ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మర్రి ఎర్రయ్య, ఎస్ఎఫ్ఎస్ ప్రిన్సిపాల్ మిక్కిలి జోసెఫ్, పీఈటీలు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు



ఆంధ్రజ్యోతి

ZONE

మంగళవారం 4 నవంబరు 2025

వైరా-మధిర

సత్తుపల్లి

8

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

WYRA, MADHIRA, SATHUPALLY

ధ్రువీకరణ పత్రాలను వెంటనే అందించాలి: సీపీఐ

కల్లూరు, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యార్థులకు సంబంధించిన పలు రకాల ధ్రువీకరణ పత్రాల జారీలో రెవెన్యూశాఖ తరపున తీవ్రమైన జాప్యం జరుగుతుందని మండల సీపీఐ కార్యదర్శి దామాల దయాకర్‌రావు సోమవారం జరిగిన ప్రజావాణిలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు తన దగ్గరకు విచారణ నిమిత్తం వచ్చిన పలు రకాల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను విచారణ జరపటంలో జాప్యం చేయటంతో సదరు సర్టిఫికేట్లు సకాలంలో అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దార్ సాంబశివుడు వివరణ ఇస్తూ ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



వాలీబాల్ విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

క్రీడలు, విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

» ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో క్రీడలు, విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఈనెల 17,18తేదీల్లో కాకతీయ అంతర్ విశ్వవిద్యాలయ వాలీబాల్ పోటీలో విజేతగా నిలిచిన జేవీఆర్ ప్రభుత్వ కళాశాల జట్టును సోమవారం ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. యూనివర్సిటీ స్థాయిలో విద్యార్థులు రాణించడం చాలా సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ఇప్పటికే నిధులు మంజూరైన ఇండోర్ స్టేడియం, మినీ స్టేడియంలలో వాలీబాల్ కోర్టును నిర్మించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నంద్రు గోపి, ఇన్‌చార్జి పీడీ డాక్టర్ చీపు పూర్ణచంద్రరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తుపల్లి ఎమ్మెల్యేను కలిసిన సింగరేణి జీఎం

సత్తుపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన చింతల శ్రీనివాస్ సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. నూతనంగా ఏర్పాటైన ఏరియాకు తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యేను కోరారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ పీవో ప్రహ్లాద్, డీవైఎస్ఎస్‌సీ రవికుమార్, సంక్షేమాధికారి దేవదాస్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఏన్కూరు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం తూతక్కలింగన్నపేట గుడ్‌న్యూస్ స్కూల్ ఉన్నతపాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం కొత్తగూడెంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 13మంది ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో నిజామాబాద్‌లో ఈనెలలో జరిగే పోటీలకు హాజరుకానున్నట్లు హెచ్‌ఎం సిస్టర్ అమల తెలిపారు. అండర్-14లో ఎల్.పరిణీత, జి.కీర్తన, జి.భానుదీక్షిత, ఎం.గౌరవ్‌సుహాస్, టి.భాస్కర్, ఎం.పవన్‌బాబు, అండర్‌లో-17లో జి.రితిక, వి.లక్ష్మీప్రణవి, ఎస్.సాక్షిత, ఇ.అవనిత, ఆర్. రాంచరణ్, ఎం. ఆర్యన్‌బాబు, పి.కిరణ్‌కుమార్, వి.ఈశ్వరాచారి జిపార్శు, ఎ.వాసు, ఎం.మనిస్విక్‌లు ఎంపికయ్యారు. విద్యార్థులను, పీఈటీ లక్ష్మణ్‌ను కరస్పాండెంట్ సిస్టర్ జోల్సిన్, ఉపాధ్యాయులు అభినందించారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వీరభద్రం

వైరా, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఎకరా ఒక్కింటికి రూ.30వేలు, కౌలురైతులకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. 33శాతం పంటలు దెబ్బతింటేనే నష్టపరిహారం ఇవ్వాలనే నిబంధనలు సడలించాలని కోరారు. సీసీఐ కొనుగోలు నిబంధనలు సడలించి రంగు మారిన పత్తిని అలాగే ధాన్యం, మొక్కజొన్న పంటలను మద్దతు ధరలకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, మండల, పట్టణ కార్యదర్శులు బాణాల శ్రీనివాసరావు, చింతనిప్పు చలపతిరావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, మచ్చా మణి పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల వితరణ



విద్యార్థులకు టై, బెల్టులను అందిస్తున్న దాతలు

ముదిగొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం గోకినపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు టై, బెల్టులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు సోమవారం అందజేశారు. పాఠశాలలోని 60మంది విద్యార్థులకు రమేష్‌బాబు తన సొంత ఖర్చులతో వీటిని పంపిణీ చేశారు. విద్యార్థులకు టై, బెల్టులు అందజేయడం పట్ల రమేష్‌బాబును పలువురు అభినందించారు. కార్యక్రమంలో మీగడ శ్రీను, పొన్నం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృత్తి విద్యాసంస్థల నిరవధిక బంద్

సత్తుపల్లిరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యాసంస్థల నిరవధిక బంద్ సోమవారం నుంచి సత్తుపల్లిలో ప్రారంభమైంది. ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హైయర్ ఇనిస్టిట్యూట్స్ (ఫాతి) ఆధ్వర్యంలలో వృత్తి విద్యా కళాశాలల విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వం 2019-20విద్యా సంవత్సరం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, బకాయిలు విడుదల చేయనందున బంద్ చేపట్టినట్లు యాజమాన్యాలు తెలిపారు. ఈ సందర్భంగా మదర్‌థెరిస్సా విద్యాసంస్థలైన మదర్‌థెరిస్సా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాల, మదర్‌థెరిస్సా అగ్రికల్చర్ డిప్లొమా కళాశాల, మదర్‌థెరిస్సా బీఎడ్ కళాశాల, రాగా బీఎడ్ కళాశాల, నవభారత్, కాకతీయ డిగ్రీ కళాశాలలు బంద్‌లో పాల్గొన్నాయి.

ఘనంగా కార్తీక మాస పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

కల్లూరు, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కల్లూరు పరిసర గ్రామాల్లో గల శివాలయాల్లో ఘనంగా కార్తీక మాసం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణపురంలోని ఎన్ఎస్‌పి క్రాస్ రోడ్డు వద్ద గల భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి, కల్లూరులోని శివాలయాల్లో వేకువ జామున నుంచి పంచామృతాలతో రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు నందీశ్వరునిశర్మ, మురళీలు ఆధ్వర్యంలో ఆయా పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయాలు కిటకిట లాడాయి.



కల్లూరులో పూజలు చేస్తున్న భక్తులు







తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

కొణిజర్ల, నవంబరు3(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌కు పంటలు కోల్పోయిన రైతులకు పంట నష్టపరిహారం అందించి రైతులను అన్ని విధాల ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సోమవారం ఆయన ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి రైతుసంఘం తరుపున వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు, తుఫాన్లు రావడం వల్ల పెసర, పత్తి, వరి పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, రమేష్, ప్రసాద్, రవి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ముదిగొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం గంధసిరికి చెందిన భుయ్యా ఉమ డిగ్రీ పూర్తిచేసి పరుగుపందెంలో రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైంది. నవంబరు 7,8,9తేదీల్లో గోవాలో జరిగే జాతీయస్థాయి పరుగుపందెంలో పాల్గొనేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతుంది. ఈ విషయం తెలుసుకున్న ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి ఉమకు రూ.పదివేల చెక్కును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు యలగొండస్వామిని అభినందించారు.

బాలికలు అంతర్జాతీయస్థాయిలో రాణించాలి

» అడిషనల్ కలెక్టర్ శ్రీజ

కొణిజర్ల, నవంబరు3(ఆంధ్రజ్యోతి):బాలికలు అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొని విజేతలుగా రాణించాలని అడిషనల్ కలెక్టర్, డీఈవో శ్రీజ విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని తనికెళ్లలో సెయింట్ అలోషియస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఖమ్మం జిల్లాస్థాయి అండర్-17 బాలికల కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడతూ.. బాలికలు అన్నిరంగాలతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో విజేతగానిలిచిన భారత్ మహిళా జట్టును ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని కోరారు. ఈక్రీడల్లో జిల్లలోని 22 మండలాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ఎంఈవో అబ్రహం, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వై.రామారావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మార్క్, రంజాన్, వెంకటేశ్వర్లు, చిన్ని, విజయరాజు, కృష్ణారావు, లాలయ్య, నాగప్రసాద్, భాగ్య, శిరీష, రజిత, పాఠశాల కరస్పాండెంట్ జోలి, ప్రిన్సిపాల్ మేరి తదితరులున్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ కలెక్టర్

హత్యా రాజకీయాలపై భట్టి సమాధానం చెప్పాలి: సండ్ర

చింతకాని, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పాతర్లపాడు గ్రామానికి సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ సామినేని రామారావు హత్యపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సండ్ర వెంకటవీరయ్య ప్రశ్నించారు. సోమవారం రామారావు కుటుంబాన్ని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజుతో కలసి ఆయన పరామర్శించారు. మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణుల అరాచకాలు పెరిగిపోయాయని, అధికార పార్టీ అండతో హత్యలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, బీఆర్ఎస్ కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, మాదినేని రమేష్, వత్సవాయి జానకిరాములు, రాచబంటి రాము, చావ హనుమంతరావు, నవీన్ పాల్గొన్నారు.



రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సండ్ర

సామినేని హత్యపై సమగ్ర విచారణ చేయాలి



వైరాలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు

వైరా, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హత్యా రాజకీయాలను ఖండించాలని, సీపీఎం రాష్ట్ర నాయకుడు సామినేని రామారావు హత్యపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వైరాలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. చింతకాని మండలం పాతర్లపాడులో సామినేని రామారావును హత్య చేసిన దోషులను వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాన్ని ఖండించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దల అండదండలు ఉన్నాయనే ధీమాతో రామారావు హత్య జరిగిందని ఆరోపించారు. వైరాలోని జాతీయ ప్రధాన రహదారిపై క్రాస్‌రోడ్డు వద్ద ధర్నా చేసి ఆతర్వాత ర్యాలీ నిర్వహించారు. పట్టణ, మండల కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు, సుంకర సుధాకర్, మచ్చా మణి, తోట నాగేశ్వరరావు, మాగంటి తిరుమలరావు, గుడిమెట్ల రజిత పాల్గొన్నారు.

జన్నారంవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి



ఉధృతంగా ప్రవహిస్తున్న నిమ్మవాగు

ఏన్కూరు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం జన్నారం నిమ్మవాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు. లోలెవల్ వంతెన ఉండడం వల్ల కొద్దిపాటి వర్షానికి బ్రిడ్జిపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో ప్రమాదాలు తరుచు జరుగుతున్నాయి. ఇటీవల తుఫాన్‌తో వరద ఉధృతికి డీసీఎం వ్యాన్ కొట్టుకుపోయి డ్రైవర్ మృతి చెందాడు. గతంలో కూడా అనేకసార్లు ప్రమదాలు జరిగాయి. వంతెనకు ఇరువైపులా రక్షణగోడలు ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవు. ఖమ్మం, కొత్తగూడెం వెళ్లేందుకు దగ్గర కావడంతో ఈరహదారి గుండా వాహనాలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తున్నాయి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రత్యేక చొరవ తీసుకుని హైలెవల్ వంతెన నిర్మాణానికి కృషిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వైరా, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈనెల ఏడోతేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆసంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు, జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు తెలిపారు. సోమవారం వైరాలో చలో హైదరాబాద్ కార్యక్రమ ప్రచార పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 మార్చినెల నుంచి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు ఆర్థిక ప్రయోజనాలు విడుదల చేయకుండా కాలయాపన చేస్తుందని వాపోయారు. నాయకులు చల్లా కృష్ణారావు, టీవీ.కృష్ణయ్యసూరి, షేక్.వలీజాన్, సామినేని వెంకటేశ్వరరావు, ఎన్.పెంటయ్య, సీహెచ్‌ఎస్ వీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: రిటైర్డు ఉద్యోగుల పెండింగ్‌సమస్యలను పరిష్కారం ఓకసం ఈనెల 7నజరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు కోరారు. సోమవారం తల్లాడలోని పెన్షనర్ భవన్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మండల కమిటీ అధ్యక్షుడు కుంచం రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి టి.వేణు, ఆర్గనైజింగ్ కార్యదర్శి దగ్గుల రఘుపతిరెడ్డి, దిరిశాల వెంకటరామయ్య, మండల ప్రధాన కార్యదర్శి మండేపుడి లక్ష్మయ్య, బీరెడ్డి తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఇందోజ బ్రహ్మయ్య, ఎం.కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఎం.కృష్ణారావు, పటాన్ మదర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్ల ఎంపిక

కల్లూరు, నవంబరు3 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని క్రీడా ప్రాంగణంలో సోమవారం ఎస్‌జీఎఫ్ తరుపున వాలీబాల్ బాలుర విభాగం జట్లను ఎంపిక చేశారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ అండర్-17, అండర్-14 బాలుర జట్లను ఎంపిక చేశారు. ఈ జట్లు ఖమ్మం జిల్లా స్థాయిలో ఈ నెల 12, 13 తేదీలలో మధిరలో నిర్వహించబోయే పోటీల్లో పాల్గొంటారని కల్లూరు మండల విద్యాశాఖ అధికారి నివేదిత తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం. నాగలక్ష్మి, క్రీడల నిర్వహణ కార్యదర్శులు బోడా భీమా, పసుపులేటి వీరరాఘవయ్య, రాధాకృష్ణ, అప్పారావు, చిన్నుసాహెబ్, పద్మాకర్, వివేక్, స్టేడియం కోర్సెస్ గౌతమ్, శ్రీను, గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన ఎస్‌జీఎఫ్ వాలీబాల్ బాలుర జట్టు

ప్రైవేట్ కాలేజీల బంద్ సంపూర్ణం

(5వ పేజీ తరువాయి)

రూ. 1200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలలో రూ. 900 కోట్లను విడుదల చేసి, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చుకోకపోవడంతో జిల్లాలోని కళాశాలల పరిస్థితులు దారుణంగా మారాయి. కళాశాలల భవనాల అద్దెలు, అధ్యాపకుల, సిబ్బంది జీత భత్యాలు, కాలేజీ బస్సుల నిర్వహణ, అన్ని ల్యాబ్‌ల నిర్వహణ, విద్యార్థినుల భద్రత, ఫర్నిచర్ కొనుగోళ్లు, కరెంటు చార్జీలు.. తదితర విద్యా వనరులను నిర్వహించడం యాజమాన్యాలకు తలనొప్పిగా మారింది. కళాశాలల నిర్వహణకు యాజమాన్యాలు ప్రతి నెల నెలా అప్పులపాలు కావాల్సిన దుస్థితి నెలకొంది. అప్పుల భారంతో కళాశాలలను నిర్వహించలేని పరిస్థితులు ఏర్పడ్డా యి. విద్యార్థులకు అత్యుత్తమ బోధన అం దించడానికి కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ.. నిర్వహిస్తున్న కళాశాలల బంద్‌కు విద్యార్థి సంఘాలు, సామాజికసంస్థలు తమ సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నాయి.

బకాయిలు చెల్లించేంతవరకూ నిరవధిక బంద్

● ప్రైవేటు కళాశాలల మేనేజ్మెంట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా చెల్లించేంత వరకూ కళాశాలల బంద్ నిరవధికంగా కొనసాగుతుంది. రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం ఇవ్వకపోవడంతో తాము కళాశాలలను నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. ఎస్సీ, ఎస్టీబీసీ, మైనార్టీ విద్యార్థులకు అత్యుత్తమ నైపుణ్యాలను అందిస్తున్న ప్రైవేటు వృత్తి విద్యా కళాశాలలకు ప్రభుత్వం అండగా నిలిచి ఆర్థిక భరోసా కల్పించాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను విడుదల చేయాలి. ఈ నెల 10 లోగా బకాయిలు విడుదల చేయాలని, లేని పక్షంలో విద్యార్థులతో కలిసి తాము కూడా హైదరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తాం.



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి

నిర్వాసితులకు న్యాయం చేస్తాం

» స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి

కారేపల్లి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): డోర్నకల్-భద్రాచలం రోడ్ రైల్వేలైన్ డబ్లింగ్ పనుల్లో వ్యవసాయభూములు కోల్పోతున్న నిర్వాసితులకు ప్రభుత్వపరంగా నాయ్యం చేస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చీమలపాడు పంచాయతీపరిధిలో పాటు పరిసరప్రాంతాలకు చెందిన పలువురు రైతులకు సంబంధించిన భూములు రైల్వేలైన్ డబ్లింగ్ పనుల్లో భూములు కోల్పోతున్న నిర్వాసితులతో తహసీల్దార్ ఏ.రమేష్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ భూములు కోల్పోతున్నవారితో ప్రత్యేకంగా మాట్లాడి విషయాన్ని కలెక్టర్‌కు పూర్తిస్థాయి నివేదిక సమర్పిస్తామన్నారు. రైతుల అభిప్రాయాలను రికార్డు చేసుకుని అందచేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారులకు చేతి సంచుల పంపిణీ

కల్లూరు, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం రేషన్ లబ్ధిదారులకు చేతి సంచులను పంపిణీ చేశారు. నవంబరు నెల నుంచి తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు మండల పరిధిలో గల 40,000 మందికి గాను రేషన్ షాపుల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు సివిల్ సప్లయి గోదాం డీటీ చిరంజివి తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమం వారం రోజుల పాటుగా కొనసాగుతుందని తెలిపారు.